Prophesy of Jesus (A)
(Telugu)

ఏసుక్రీస్తు

ఈసా (అలైహిస్సలామ్)

అందజేసిన శుభవార్త

ఉర్దూ మూలం
మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మతుల్లా అలైహ్)

తెలుగు
ఎస్.ఎమ్. మలిక్

ముందుమాట

ఈ చిరు పుస్తకం ప్రత్యేక రచన కాదు. మౌలానా మౌదూదీ వ్యాఖ్యాన గ్రంథరాజమయిన 'తఫ్హీముల్ ఖుర్ఆన్' నుండి పరిగ్రహించిన వ్యాఖ్యాన ముక్తావళి. మౌలానా వ్యాఖ్యాన గ్రంథం నుండి ఈ విధంగా సేకరించి అనేక విషయాల శీఘ్ర అవగాహనకు చిన్న చిన్న పుస్తకాలను ప్రచురించవలసిన అవసరముంది. ఇప్పటికే అలాంటి పుస్తకాలు కొన్ని వెలువరించడం జరిగింది. ఇదీ అటువంటి శీఘ్ర గ్రాహ్యమయిన, సులభ గ్రాహ్యమయిన పుస్తకాలలో ఒకటి.

ఇది దివ్యఖుర్ఆన్లోని 61వ సూరా, అస్ సఫ్లోని 6వ ఆయత్కు మౌలానా మౌదూదీ వ్రాసిన వ్యాఖ్యానానికి తెలుగురూపం. ఈ వ్యాఖ్యానాన్నే ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగింది. దీని ప్రత్యేకత ఏమిటంటే మౌలానా మౌదూదీ పరిశోధనలో ముందుకు వచ్చిన అనేక విషయాలు, బైబిల్లోను, సువార్తల్లోను, యూదులూ క్రైస్తవ మహనీయులు ఎటువంటి ప్రక్షిప్తాలకు పాల్పడ్డారో వాటి వివరాలు, పాత నిబంధన, కొత్త నిబంధన, సువార్తల మధ్య ఉన్న విభిన్న వ్యత్యాసాలు అన్నీ మనకు ఒకే చోట ప్రాప్తమవుతాయి. మరో ప్రముఖమయిన విషయం ఏమిటంటే ఏసుక్రీస్తు శిష్యుల్లో ప్రముఖ శిష్యుడయిన 'బర్నబా' స్వయంగా వ్రాసిన క్రీస్తు జీవిత వివరాలు, ప్రవక్తగా ఏసు బోధనలు క్రైస్తవ మత గురువుల అండనీడలలో ఎలా మరుగున పడిపోయాయో, అయినా అవి దైవికంగా ఎలా బయటపడ్డాయో కూడా ఈ పుస్తకం ద్వారా మనకు ద్యోతక మవుతుంది. 'బర్నబా సువార్త' ప్రత్యేకతలు ఇతర నాలుగు సువార్తలకన్నా ఎంతగా విలువయినవో మనకు సవివరంగా విశదమవుతుంది. ఇప్పుడు 'బర్నబా' వ్రాసిన సువార్త ఏ రూపంలో ఎక్కడ లభ్యమవుతుందో కూడా మనం తెలుసుకోగలుగుతాము.

నిజానికి సత్యాన్వేషణ అన్నది ఓ నిరంతర పయనం. మనుషులు ఏ సిద్ధాంతాన్ని అనుసరించేవారయినా, ఏ మతాన్ని అవలంబించే వారయినా, ముస్లిములయినా, క్రైస్తవులయినా, హిందువులయినా - మరెవరయినా సరే నిష్కల్మష హృదయంతో సత్యాన్ని కాంక్షించే చిత్తశుద్ధితో సత్యాన్ని తెలుసుకునే, అర్థం చేసుకునే, దాన్ని స్వీకరించే, అనుసరించే సాహసం, ధైర్యం, ఆత్మబలం కలిగి ఉండాలి. అదే నిజమయిన మానవీయ విలువలకు అర్థం. అయితే సత్యం అన్న పేరుతో ముందుకు వచ్చే ప్రతి అంశం సత్యం కానవసరం లేదు. అనుశీలన, పరిశీలన, పరిశోధన ద్వారా నికార్సుగా తేలినదే నిజమయిన 'సత్యం'. అదే స్వీకారయోగ్యం, అదే అనుసరణీయం.

సత్యాన్వేషకులయిన, ముస్లిమ్, హిందూ, క్రైస్తవ సోదరులు ఈ చిరు పుస్తకాన్ని సహృదయంతో ఆహ్వానిస్తారని, నిండు మనసుతో ఆదరించి అధ్యయనం చేస్తారని ఆశిస్తున్నాము.

ఈ చిరు పుస్తకం సంకలనంలో, రూపొందించడంలో అన్ని విధాలుగా తోడ్పడిన సోదరులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. దైవం వారి సేవను స్వీకరించి తగిన ప్రతిఫలం ప్రసాదించుగాక!

ఈ పుస్తక రూపకల్పనలో, ముద్రణలో ఏమయినా లోటు పాట్లున్నట్లయితే పాఠక సోదరులు సహృదయంతో తెలిపినట్లయితే రాబోయే ఎడిషన్లలో సవరించగలమని హామీనిస్తున్నాము.

హైదరాబాద్

– ప్రకాశకులు

28-6-2014

అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

శుభవార్త

وَإِذْ قَالَ عِيسَى ابْنُ مَرْيَمَ يَٰبَنِيٓ إِسْرَآءِيلَ
إِنِّي رَسُولُ اللَّهِ إِلَيْكُم مُّصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيَّ مِنَ
التَّوْرَىٰةِ وَمُبَشِّرًا بِرَسُولٍ يَأْتِي مِن بَعْدِي اسْمُهُۥٓ أَحْمَدُ ۖ
فَلَمَّا جَآءَهُم بِالْبَيِّنَٰتِ قَالُوا هَٰذَا سِحْرٌ مُّبِينٌ ۝

అనువాదం:

ఇంకా[1] గుర్తుకు తెచ్చుకోండి, మర్యమ్ కుమారుడు ఈసా మాటను. అతను అప్పుడు అన్నాడు, "ఇస్రాయీల్ వంశీయులారా, నేను మీ వద్దకు దైవం పంపిన సందేశహరుణ్ణి, నాకన్నా ముందు వచ్చి ఉన్న తౌరాత్‌ని ధ్రువపరిచేవాణ్ణి నేను;[2] ఇంకా శుభ వార్త నిచ్చేవాణ్ణి, మరో సందేశహరుని గురించి, అతను నా తరువాత రానున్నాడు, అతని పేరు అహ్మద్;"[3] కాని తీరా అతను వారి వద్దకు అతి స్పష్టమయిన సూచనలు తీసుకువచ్చినప్పుడు వారు, ఇది ప్రస్ఫుటమయిన వంచన అని అన్నారు.

(దివ్య ఖుర్‌ఆన్ : అస్ సఫ్ : 6)

1. ఇది బనీ ఇస్రాయీల్ చేసిన రెండవ అవిధేయత ప్రస్తావన. ఒక అవిధేయత, వారు తమ ఉన్నతి కాలపు ప్రారంభంలో చేశారు. రెండవ అవిధేయత ఇది. దీన్ని వారు ఆ కాలం చివర, పూర్తిగా సమాప్తమయిన సందర్భాన చేశారు. ఆ తరువాత చిరకాలానికి వారిపైన దేవుని అభిశాపం ముద్రపడిపోయింది. ఈ రెండు సంఘటనలు ప్రస్తావించినదాని ఉద్దేశ్యం, దైవసందేశహరుల పట్ల బనీ ఇస్రాయీల్ వంటి వైఖరి నవలంబించి నట్లయితే కలిగే పర్యవసానాన్ని గురించి ముస్లిములను హెచ్చరించడం.

2. ఈ వాక్యానికి మూడు అర్థాలు వర్తిస్తాయి, మూడూ సరయినవే:

ఒకటి, నేనేదో విచిత్రమయిన కొత్త ధర్మం తీసుకురాలేదు. మూసా (అలైహిస్సలామ్) తెచ్చిన ధర్మమే తెచ్చాను. నేను తౌరాత్‌ని ఖండిస్తూ రాలేదు, దాన్ని ధ్రువీకరిస్తున్నాను. దైవ సందేశహరులు సదా తమకు పూర్వం వచ్చిన ప్రవక్తలను ధ్రువీకరించినట్లే నేనున్నూ. కనుక మీరు నా దైవదౌత్యాన్ని అంగీకరించకపోవడానికి ఏ కారణమూ లేదు.

రెండు, నా రాకను గురించి తౌరాత్‌లో ఉన్న శుభవార్తలకు అనుగుణ్యమయినవాణ్ణి. కనుక మీరు నన్ను వ్యతిరేకించడానికి బదులు, మునుపటి ప్రవక్తలు ఎవరి రాకను గురించి సమాచారం అందజేశారో అతను వచ్చినందుకు మీరు దాన్ని స్వాగతం పలకవలసింది.

ఈ వాక్యాన్ని తదుపరి వాక్యంతో కలిపి చదివినట్లయితే మూడవ అర్థం ఇలా ముందుకు వస్తుంది. నేను, దైవ సందేశహరుడు "అహ్మద్" (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) రాకను గురించి తౌరాత్‌లో వచ్చిన శుభవార్తను ధ్రువపరుస్తున్నాను. మరి నేను స్వయంగానూ ఆయన రాకను గురించి శుభవార్తనిస్తున్నాను. ఈ మూడవ అర్థాన్నిబట్టి మహనీయ ఈసా (అలైహిస్సలామ్) చెప్పిన ఈ మాటలోని సంకేతం, దైవ సందేశహరుల (స)ను గురించి మహనీయ మూసా (అ) తన జాతి నుద్దేశించి ప్రసం

గిస్తూ అందజేసిన శుభవార్తకు సంబంధించింది. అందులో ఆయన ఇలా ప్రవచించారు :

"హోరేబులో ఆ సమాజ దినమున నీవు–నేను చావక యుండునట్లు మళ్ళీ నా దేవుడైన యెహోవా స్వరము నాకు వినబడకుండును గాక, ఈ గొప్ప అగ్ని నాకు ఇకను కనబడకుండును గాక అని చెప్పితివి. ఆ సమయమున నీ దేవుడైన యెహోవాను నీవు అడిగిన వాటినన్నిటి చొప్పున నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నా వంటి ప్రవక్తను నీ సహోదరులలో నీ కొరకు పుట్టించును, ఆయన మాట నీవు వినవలెను. మరియు యెహోవా నాతో ఇట్లనెను. వారు చెప్పిన మాట మంచిది, వారి సహోదరుల నుండి నీ వంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను; అతని నోట నా మాటల నుంచెదను; నేను అతని నాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును. అతడు నా నామమున చెప్పు నా మాటలను విననివాడిని దాని గూర్చి విచారణ చేసెదను. (ద్వితీయోపదేశ కాండము:18: 15–19).

ఇది తౌరాత్‌లోని స్పష్టమయిన భవిష్యవాణి. ఇది మహనీయ ముహమ్మద్ (స)కు తప్ప మరెవరికీ అతకదు. ఇందులో హజ్రత్ మూసా (అ) తన జాతికి దేవుని ఈ వచనం వినిపిస్తూ– "నేను నీ కొరకు నీ సోదరులలో నుంచి ఒక ప్రవక్తను పుట్టిస్తాను" అని చెప్పాడని అంటున్నారు. ఒక జాతికి 'సహోదరులు' అంటే ఉద్దేశం, స్వయంగా అదే జాతిలోని ఏదయినా తెగో లేక వంశమో కాజాలదు. మరేదయినా ఇతర జాతియే కాగలదు. దానితో దగ్గరి జాతీయ సంబంధం కలిగినదయి ఉంటుంది. దీని ఉద్దేశ్యం, స్వయాన బనీ ఇస్రాయీల్‌లో నుంచే ప్రవక్త పుట్టుక అయినట్లయితే పదాలు – నేను మీ కొరకు స్వయంగా మీ నుండే

ఒక ప్రవక్తను ప్రభవింపజేస్తాను అని ఉండేవి. కాగా బనీ ఇస్రాయీల్ సోదరులంటే ఉద్దేశం తప్పనిసరిగా బనీ ఇస్మాయీలే కాగలరు. వారు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) సంతానం కావటాన వారితో వంశానుగత సంబంధీకులు అవుతారు. పైగా భవిష్యవాణికి అనుగుణ్యంగా మరో బనీ ఇస్రాయీల్ ప్రవక్త ఎవరూ కాగలగకపోవటానికి కారణం, హజ్రత్ మూసా (అ) తరువాత బనీ ఇస్రాయీల్‌లో ఒక్క ప్రవక్త కాదు, అనేకమంది ప్రవక్తలు ఆవిర్భవించారు. వారి ప్రస్తావనలు బైబిల్ నిండా ఉన్నాయి.

ఈ భవిష్యవాణిలో చెప్పబడిన రెండవ విషయం, ఆవిర్భవింపబడే ప్రవక్త హజ్రత్ మూసా మాదిరిగా ఉంటాడు అన్నది. దీని ఉద్దేశం, రూపు రేఖలు, జీవన వ్యవహారాల పోలిక కాదని తెలుస్తూనే ఉంది. ఎందుకంటే, ఈ విధంగా ఏ వ్యక్తీ మరో వ్యక్తికి పోలి ఉండడు. దీని ఉద్దేశం కేవలం దైవదౌత్య లక్షణంలో పోలిక కూడా కాదు. ఎందుకంటే, ఈ పోలిక సయితం, హజ్రత్ మూసా (అ) తరువాత వచ్చిన ప్రవక్తలందరికీ వర్తి స్తుంది. అందువల్ల ఏ ఒక్క ప్రవక్త లక్షణం మాత్రమే కాజాలదు – ఈ లక్షణం రీత్యా ఆయన ఈయనకు పోలి ఉండటానికి. ఇక ఈ రెండు కోణాలలోనూ పోలిక చర్చనీయాంశం కాకపోయినట్లయితే మరో పోలిక ఏదీ? రాబోయే ఒకే ప్రవక్తను ప్రత్యేకించడం అర్థవంతమవడానికి సరిపోయేది మిగిలింది ఒక్కటే తప్ప మరేదీ కాజాలదు – ఆ ప్రవక్త ఒక స్థిరమయిన షరీఅత్ (శాసనం) తెచ్చే ప్రవక్తగా మహనీయ మూసా (అ)ను పోలిన వాడయి ఉండటం. ఈ ప్రత్యేకత ఒక్క ముహమ్మద్ (స)లో తప్ప మరెవరిలోనూ కానరాదు. ఎందుకంటే, ఆయనకు పూర్వం బనీ ఇస్రాయీల్‌లో ఆవిర్భవించిన ప్రవక్తలందరూ మూసా (అ) తెచ్చిన షరీఅత్ అనుయాయులే. వీరిలో ఎవరూ స్థిరమయిన షరీఅత్ తెచ్చినవారు ఒక్కరూ లేరు.

ఈ భావాన్వయానికి బలం చేకూర్చే పదాలు ఈ భవిష్యవాణిలో ఉన్నాయి :

"హోరేబులో సమాజదినమున నీవు – నేను చావక యుండునట్లు మళ్ళీ నా దేవుడయిన యెహోవా స్వరము నాకు వినబడుకుండునుగాక, ఈ గొప్ప అగ్ని నాకు ఇకను కనబడకుండునుగాక అని చెప్పితివి. ఆ సమయమున నీ దేవుడైన యెహోవాను నీవు అడిగిన వాటినన్నిటి చొప్పున నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నా వంటి ప్రవక్తను నీ సహోదరులలో నీ కొరకు పుట్టించును, ఆయన మాట నీవు వినవలెను. మరియు యెహోవా నాతో ఇట్లనెను. వారు చెప్పిన మాట మంచిది; వారి సహోదరుల నుండి నీ వంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను; అతని నోట నా మాట నుంచెదను."

ఈ వచనంలో హోరేబు అన్నది, మహనీయ మూసా (అ) కు తొలిసారిగా షరీఅత్ ఆదేశాలు ఇవ్వబడిన కొండ. బనీ ఇస్రాయీల్ చేసిన ఏ అర్థింపును గురించి ఇందులో ప్రస్తావించడం జరిగిందో దాని భావం, భావిలో ఏదయినా షరీఅత్ మాకు అందజేయబడితే, హోరేబు కొండ దాపున షరీఅత్ ప్రసాదిస్తూ సృష్టించినటువంటి భయంకర పరిస్థితులలో ఇవ్వరాదు అని. ఆ పరిస్థితుల ప్రస్తావన ఖుర్ఆన్‌లోనూ వచ్చింది, బైబిల్ లోనూ ఉంది. (చూడండి, అల్ బకర : 55, 56, 63; అల్ ఆరాఫ్ : 155, 171; బైబిల్ నిర్గమకాండం : 19 : 17–18). దీనికి బదులుగా హజ్రత్ మూసా (అ) బనీ ఇస్రాయీల్‌కు, పరమ ప్రభువు మీ ఈ అర్థింపును స్వీక రించాడు అని, ఆయన, నేను వారి కొరకు ఒక ప్రవక్తను ఆవిర్భవింప జేస్తాను, అతని నోట నా వచనాలు వేస్తాను, అంటే భావిలో షరీఅత్

అందజేస్తూ హోరేబు కొండ దాపున సృష్టించినటువంటి ఆ భయంకర పరిస్థితుల్ని సృష్టించడం జరగదు. ఇక ఏ ప్రవక్తనయితే ఈ పదవీ బాధ్యతలపైన నియోగించడం జరుగుతుందో అతని నోట దైవ వచనాన్ని వేయడం జరుగుతుంది. ఆయన దాన్ని మానవులకు వినిపిస్తారు. ఈ విశదీకరణను పరిశీలిస్తే ఈ విషయంలో ఎటువంటి సంశయం మిగిలే అవకాశం ఉండదు, దీనికి అనుగుణ్యమయిన వారు ఒక మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తప్ప మరెవరు కాగలరు? హజ్రత్ మూసా (అ) తరువాత శాశ్వత ప్రతిపత్తిగల షరీఅత్ కేవలం ఆయన (స)కే ప్రసాదించబడింది. దాన్ని ప్రసాదించేటప్పుడు హోరేబు కొండ దాపున బనీ ఇస్రాయీల్ సమావేశం జరిగినట్లు ఏ సమావేశమూ జరగలేదు. షరీఅత్ ఆదేశాలు ఇచ్చేటప్పుడు ఏ సమయాననయినా సరే అక్కడ సృష్టించబడిన పరిస్థితుల్ని సృష్టించడం జరగలేదు.

3. ఇది దివ్య ఖుర్ఆన్‌లోని ఎంతో మహత్తుగల ఆయత్ (వచనం). దీని విషయంలో ఇస్లామ్ విరోధుల పక్షంగా ఎంతో వాదవివాదాలూ జరిగాయి. ఈ సందర్భంలో అతి నికృష్టమయిన అపరాధపూర్వక నిజాయితీ లేమినీ ప్రదర్శించడం జరిగింది. ఇందులో తెలిపిన దాన్నిబట్టి మహనీయ ఈసా (అలైహిస్సలామ్) దైవ సందేశహరులు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) పేరును అతి స్పష్టంగా పలికి ఆయన రాకను గురించి శుభవార్తనిచ్చారు. అందువల్ల దీన్ని వివరంగా చర్చించడం అవసరం.

(1) ఇందులో ప్రవక్త మహనీయుల పేరు **'అహ్మద్'** అని తెలుపడం జరిగింది. 'అహ్మద్' అన్న పదానికి రెండర్థాలు. ఒకటి, అల్లాహ్‌ను ఇతోధికంగా ప్రస్తుతించే వ్యక్తి, రెండు, ఇతోధికంగా ప్రశంసించబడిన వ్యక్తి లేదా మానవుల్లో అందరికన్నా అధికంగా ప్రశంసించదగిన వ్యక్తి అన్నది. ప్రామాణికమయిన హదీసుల ద్వారా ఇది కూడా ప్రవక్తశ్రీ (స) పేర్లలో

ఒకటని రుజువవుతోంది. ముస్లిమ్, అబూదావూద్, తయాలిసీలో హజ్రత్ అబూమూసా అష్అరీ ఉల్లేఖనం ఒకటుంది. అందులో ప్రవక్తశ్రీ(స),

"انا محمد وانا احمد والحاشر...."

"అనా ముహమ్మద్ వ అనా అహ్మద్ వ అల్ హాషిర్" - "నేను ముహమ్మద్‌ని, నేను అహ్మద్‌ని, నేను హాషిర్‌ని..." అని సెలవిచ్చారు. ఇదే విషయాన్ని తెలిపే ఉల్లేఖనాలు హజ్రత్ జుబైర్ బిన్ ముత్యిమ్ ద్వారా ఇమామ్ మాలిక్, బుఖారి, ముస్లిమ్, దారిమి, తిర్మిజీ, నసాయీ ప్రభృతులూ ఉటంకించారు. ప్రవక్తశ్రీ (స)కి ఈ పేరు ప్రవక్త సహచరుల్లో ప్రఖ్యాతమయినది; కాగా హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ చెప్పిన ఈ కవిత దీనికి సాక్షి:

صلى الاله ومن يحف بعرشه

والطيبون على المبارك احمد

"అల్లాహ్, ఆయన అర్ష్ (సింహాసనం) చుట్టూ గుమి కూడిన దైవదూతలు, పరిశుద్ధ అస్తిత్వాలన్నీ శుభప్రదుడయిన అహ్మద్‌కు 'దురూద్' (శుభాభినందనలు) పంపారు."

చరిత్ర ద్వారా సయితం ఇది రుజువయిన అంశమే. ప్రవక్తశ్రీ (స) పేరు కేవలం 'ముహమ్మద్' (స) మాత్రమే కాదు, 'అహ్మద్' కూడా ఆయన పేరే. అరేబియా సాహిత్యమంతా వెదకినా ప్రవక్తశ్రీ (స)కు పూర్వం ఎవరిపేరయినా 'అహ్మద్' అని పెట్టడం జరిగిందని కానరాదు. ప్రవక్తశ్రీ (స) తరువాత, లెక్కకు మించిన వ్యక్తులకు 'అహ్మద్' అనీ, 'గులామ్ అహ్మద్' అనీ పేర్లు పెట్టడం జరిగింది. ప్రవక్త కాలం నుండి నేటి వరకు ముస్లిమ్ సముదాయంలో ఆయనకు చెందిన ఈ పేరు ప్రముఖంగా

ప్రఖ్యాతి గడించింది అనడానికి ఇంతకన్నా వేరే నిరూపణ మరేం కాగలదు? ఈ పేరు ప్రవక్తశ్రీ (స)కి చెందినది కాకపోతే తమ సంతానా నికి 'గులామ్ అహ్మద్' అని పేరు పెట్టుకున్నవారు వారిని ఏ 'అహ్మద్'కు గులామ్‌గా నిర్ణయించినట్లు?

(2) యోహాను సువార్త ప్రకారం, బనీ ఇస్రాయీల్ ముగ్గురు మహో వ్యక్తుల రాకను ఎదురుచూస్తూ ఉన్నారు. ఒకరు మసీహ్ (క్రీస్తు), రెండవవారు, ఏలీయా (అంటే హజ్రత్ ఇల్యాస్ రెండవ రాక), మూడవ వారు 'ఆ ప్రవక్త'. సువార్తలోని పదాలు ఇవి :

> నీవెవడవని అడుగుటకు యూదులు యెరూషలేము నుండి యాజకులను లేవీయులను యోహాను నొద్దకు పంపి నప్పుడు అతడిచ్చిన సాక్ష్యమిదే. అతడు ఎరుగననక ఒప్పు కొనెను; - క్రీస్తును కానని ఒప్పుకొనెను. కాగా వారు- మరి నీవెవరవు, నీవు ఏలీయావా అని అడుగగా అతడు- కాననెను- నీవు ఆ ప్రవక్తవా అని అడుగగా- కానని ఉత్తర మిచ్చెను. కాబట్టి వారు - నీవెవరవని .... అతని నడిగిరి. అందుకతడు ... ప్రభువు త్రోవ సరళము చేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పు ఒకని శబ్దము అని చెప్పెను .... వారు - నీవు క్రీస్తువైనను, ఏలీయా వైనను, ఆ ప్రవక్త వైనను కానియెడల ఎందుకు బాప్తిస్మ మిచ్చుచున్నావని అతనిని అడుగగా .... (యోహాను : 1 : 19-25)

ఈ పదాలు, బనీ ఇస్రాయీల్ హజ్రత్ మసీహ్, హజ్రత్ ఇల్యాస్‌లే కాక మరో ప్రవక్తకై ఎదురుచూస్తూ ఉండేవారన్న విషయాన్ని అతి స్పష్టంగా ధృఢపరుస్తున్నాయి, అంటే, వారు ఎదురు చూసేది హజ్రత్ యహ్యాను కాదన్నమాట. 'ఆ ప్రవక్త' రాకకు సంబంధించిన విశ్వాసం బనీ

ఇస్రాయీల్‌లో అత్యంత ప్రసిద్ధమయి ఉండేది. కాగా "ఆ ప్రవక్త" అని అంటే ఆ విషయాన్ని సూచించేందుకు అది సరిపోతుంది. ఆ తరువాత "ఆయన రాకను గురించి తౌరాత్‌లో భవిష్యవాణి ఉందన్న విషయమూ" గుర్తుచేయనవసరం లేకపోయిందన్నమాట. దీనితో పాటు దీనివల్ల తెలిసే మరో విషయం ఏమిటంటే, వారు ఏ ప్రవక్తను గురించి సంకేతప్రాయంగా సూచిస్తున్నారో ఆయన రాక విషయం గట్టిగా నిర్ధారితమయినదే. ఎందు కంటే, హజ్రత్ యహ్యాను వారు ఈ ప్రశ్నలు అడిగినప్పుడు ఆయన, 'మరో ప్రవక్త ఎవరూ రాబోవటం లేదు, మీరు ఏ ప్రవక్తను గురించి అడుగు తున్నారు?' అని అనలేదు.

(3) ఇక యోహాను సువార్తలో నిరంతరాయంగా 14వ అధ్యాయం నుండి 16 వరకు ఉటంకించబడిన భవిష్యవాణులను పరిశీలించండి :

> "నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకు అనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడా నివసించును, మీలో ఉండును."
>
> (యోహాను 14 : 16-17).
>
> "నేను మీ యొద్ద ఉండగానే యీ మాటను మీతో చెప్పితిని. ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును."
>
> (యోహాను14 : 25-26)
>
> "ఇకను మీతో విస్తరించి మాటలాడను; ఈ లోకాధికారి

వచ్చుచున్నాడు. నాతో వానికి సంబంధమేమియు లేదు."
(యోహాను 14:30)

"తండ్రి యొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త, అనగా తండ్రి యొద్ద నుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును." (యోహాను 15:26)

"అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను, నేను వెళ్ళి పోవుట వలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళని యెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్ళిన యెడల ఆయనను మీ యొద్దకు పంపుదును.
(యోహాను 16:7)

"నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవుగాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయును. కనుక నన్ను మహిమపరచును. తండ్రికి కలిగినవన్నియు నావి, అందుచేత ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయునని నేను చెప్పితిని."
(యోహాను 16 : 12-15)

(4) ఈ వచనాల అర్థాన్ని నిర్ధారించటానికి మొదట తెలుసుకోవలసిన విషయం ఒకటుంది. మసీహ్ (అ) ఆయన సమకాలీన పాలస్తీనా

ప్రజల సామాన్య భాష ఆరామీ (Aramic) భాషకు చెందిన సిరియాక్ (Syriac) అనే యాస (Dialect) క్రీస్తు పుట్టుకకు రెండు, రెండున్నర వందల సంవత్సరాలకు పూర్వమే సలూకీ (Seleucide) పాలకుల కాలంలో ఈ ప్రాంతంనుండి హెబ్రూ భాష సెలవు తీసుకున్నది. సిరియాక్ దాని స్థానంలోకి వచ్చేసింది. ఆ తరువాత 'సలూకీ' ఆపైన రోమను రాజ్య ప్రభావం చేత గ్రీకు భాష కూడా ఆ ప్రాంతంలోకి చేరిపోయినా అది, పాలకుల దర్బారులో ప్రవేశం పొంది, లేదా ప్రవేశాన్ని కోరి గ్రీకు తత్వానికి బానిసయిపోయిన వర్గాల వరకే పరిమితమయి ఉండేది. పాలస్తీనా ప్రజలలో సామాన్యంగా సిరియాక్ భాషకు చెందిన ఓ ప్రత్యేక యాసే వాడుకలో ఉండేది. అయితే దాని ధోరణి, ఉచ్చారణ, నానుడులు డెమాస్కస్‌లో మాటలాడే సిరియాక్ భాషకు భిన్నమయినవిగా ఉండేవి. ఆ దేశ ప్రజలు గ్రీకు భాషను ఏమాత్రం ఎరుగరు. అదీ ఏ మేరకు అంటే, క్రీ.శ. 70లో యెరూషలేమును వశపరచుకున్న తరువాత రోమను జనరల్ టైటస్ (TITUS) యెరూషలేము ప్రజలనుద్దేశించి గ్రీకు భాషలో సంబోధించినప్పుడు దాని అనువాదం సిరియాక్ భాషలో చేయవలసి వచ్చింది. దీన్నిబట్టి క్రీస్తు తన శిష్యులకు చెప్పినదంతా అది అనివార్యంగా సిరియాక్ భాషలోనే చెప్పి ఉంటారన్న విషయం దానంతట అదే స్పష్టమవుతోంది.

తెలుసుకోవలసిన రెండవ విషయం, బైబిల్‌లోని నాలుగు సువార్తలూ గ్రీకు భాష మాటలాడే క్రైస్తవులు వ్రాసినవి. వారు మహనీయ ఈసా (అ) తరువాత ఆ మతంలో ప్రవేశించినవారు. వారికి మహనీయ ఈసా (అ) సూక్తులు, మాటలు, చేతల వివరాలు ఏవయినా సిరియాక్ భాష మాట లాడే క్రైస్తవుల ద్వారా వ్రాతమూలకంగా గాక మౌఖిక కథనాల రూపంలోనే చేరాయి. ఆ సిరియాక్ కథనాలను వారు తమ భాషలో

అనువదించి నమోదు చేసుకున్నారు. వాటిలో ఏ సువార్త కూడా క్రీ.శ. 70కు పూర్వం వ్రాసినది కాదు. యోహాను సువార్త అయితే హ(జత్ ఈసా (అ)కు ఒక శతాబ్ది తరువాత బహుశా ఆసియా మైనర్‌కు చెందిన పట్టణం ఇఫ్‌సుస్‌లో వ్రాయబడినది. పైగా ఈ సువార్తల ఏ మూలప్రతి కూడా అది మొదట వ్రాయబడిన గ్రీకు భాషలో భద్రంగా లేదు. ముద్రణాలయం కనిపెట్టడానికి పూర్వమే గ్రీకు ప్రతులు, పలుచోట్ల నుండి వెదకి ప్రోగు చేసినవన్నింటిలో ఏదీ నాల్గవ శతాబ్దికి పూర్వం వ్రాసింది కాదు. అందువల్ల ఈ మూడు శతాబ్దుల మధ్య కాలంలో వాటిలో ఏ ఏ మార్పులు చేర్పులు జరిగాయో చెప్పడం కష్టమే. ఈ వ్యవహారంలో దీన్ని మరీ అనుమానాస్పదం చేసే విషయం ఏమిటంటే, క్రైస్తవులు తమ సువార్తలలో తమ ఇష్టానుసారం, తెలిసీ మార్పులు, చేర్పులు చేయడాన్ని పూర్తిగా ధర్మసమ్మతమేనని భావిస్తారు. ఇన్సయిక్లోపీడియా బ్రిటానికా (1946 ఎడిషన్) 'బైబిల్' శీర్షికన వ్యాసకర్త ఇలా వ్రాస్తున్నాడు :

> "సువార్తలలో ఇటువంటి బాహాటమయిన మార్పులు ఐచ్ఛికంగా చేయబడ్డాయి. ఉదాహరణకు కొన్ని పూర్తి పాఠాన్ని మరేదయినా మూలం నుండి గ్రహించి గ్రంథంలో చేర్చడం జరిగింది. ... ఈ మార్పులు అతి స్పష్టంగా కొందరు ఐచ్ఛికంగా చేశారు. గ్రంథాన్ని మెరుగుపరచడం లేదా ప్రయోజనకరంగా మార్చడం వారు తమ బాధ్యతగా భావించేవారు. అందువల్ల మూల గ్రంథంలో చేర్చ డానికి ఎక్కడి నుండి అయినా ఏదయినా విషయం దొరికితే వారు అందులో ఆ విషయాన్ని చేర్చడానికి తమ్ము తాము అర్హతగల వారుగా భావించేవారు. ... అనేక అదనపు విషయాలు రెండవ శతాబ్దిలోనే జరిగాయి, వాటి మూల స్థానం ఏదో ఏమాత్రం తెలియదు."

ఇటువంటి పరిస్థితులలో, సువార్తలలో మనకు కానవచ్చే మహనీయ ఈసా (అ) సూక్తులు సరిగ్గా పూర్తిగా ఉటంకించబడ్డాయని, వాటిలో ఎటువంటి మార్పులు చేర్పులు జరగలేదని గట్టిగా చెప్పడం బహుకష్టం.

మూడవది, మరీ ముఖ్యమయిన విషయం ఏమిటంటే, ముస్లిములు పాలస్తీనాను జయించిన తరువాత కూడా దాదాపు మూడు శతాబ్దుల వరకు సిరియాక్ భాషే పాలస్తీనా క్రైస్తవ పౌరుల భాషగా అలరారింది. తొమ్మిదవ శతాబ్దిలో బహుశా దాని స్థానే అరబీ భాష వచ్చింది. ఆ సిరియాక్ భాష మాటలాడే పాలస్తీనా ప్రజల ద్వారా క్రైస్తవ ఉల్లేఖనాలను గురించి, మొదటి మూడు శతాబ్దుల వరకు ముస్లిమ్ ఉలమాలకు ప్రాప్తమయిన సమాచారమే విశ్వసనీయమయినది. సిరియాక్ నుండి గ్రీకు, మళ్ళీ గ్రీకు నుండి లాటిన్ భాషలలోకి అనువాదాల అనువాదాలుగా అందిన సమాచారంకన్నా ప్రత్యక్షంగా సిరియాక్‌లో అందిన ఈ సమాచారమే అధిక విశ్వసనీయమయి ఉంటుంది. ఎందుకంటే, క్రీస్తు నోటి నుండి వెలువడిన మూల సిరియాక్ భాష పదాలు వారి వద్ద భద్రమయి ఉండే అవకాశాలు అధికంగా ఉంటాయి.

(5) ఈ తిరస్కరించ వీలులేని చారిత్రక యదార్థాలను దృష్టిలో ఉంచుకుని చూడండి, యోహాను సువార్తలో హజ్రత్ ఈసా (అ) తన తరువాత వచ్చే వ్యక్తిని గురించి వార్తనందజేస్తున్నారు. ఆ వచ్చే వ్యక్తిని గురించి ఆయన "లోకాధికారి" (విశ్వనాయకుడు), "ఎల్లప్పుడును" ఉంటారు, "సర్వసత్యములోనికి నడిపించును", ఇంకా స్వయంగా ఆయన (అంటే హజ్రత్ ఈసా)ను గూర్చి "సాక్ష్యమిచ్చును". యోహాను చెప్పిన ఈ కథనాలలో "పరిశుద్ధాత్మ", "సత్యస్వరూపి యగు ఆత్మ" మొదలయిన పదాలను చేర్చి ఉద్దేశ్యాన్ని సంశయాత్మకం చేసే ప్రయత్నం బాగా జరిగినప్పటికీ ఈ కథనాలను పరిశీలనగా చదివినట్లయితే స్పష్టంగా

తేలిపోతుంది, ఆ వచ్చే వ్యక్తి ఏదో ఆత్మ కానే కాదు, ఒక మానవుడు, ప్రత్యేక వ్యక్తి అని. ఆ వ్యక్తి బోధనలు సర్వజనీనమయినవి, సర్వవ్యాపక మయినవి, ప్రళయం వరకు మనగలిగేవి అనీ నిర్ధారితమవుతుంది. ఆ ప్రత్యేక వ్యక్తి కొరకు తెలుగు అనువాదంలో "ఆదరణకర్త" అన్న పద ప్రయోగం జరిగింది. (ఉర్దూ అనువాదంలో "మదద్‌గార్" - సహాయ కుడు) అన్న పదం ప్రయోగించబడింది. యోహాను సువార్త మూల గ్రంథంలో గ్రీకు భాషలో ప్రయోగించిన పదం గురించి క్రైస్తవులు అది Paracletus అని పట్టుపట్టి వాదిస్తారు. కాని దాని అర్థాన్ని నిర్ధారిం చడంలో స్వయాన క్రైస్తవ పండితులకే కఠోర శ్రమ ఎదురయింది. మూల భాష గ్రీకులో Paracletus అన్న పదానికి అనేక అర్థాలు వర్తిస్తాయి: ఏదయినా చోటికి పిలువడం, సహాయానికి పిలువడం, హెచ్చరించడం, భయపెట్టడం, ప్రేరేపించడం, పురికొలపడం, అభ్యర్థించడం, ప్రార్థించడం అనే అర్థాలు పుడుతాయి. హీనభావంలో దీని అర్థం, ఊరడించడం, సాంత్వన పలకడం, ప్రోత్సహించడం అని కూడా వస్తుంది. బైబిల్‌లో ఈ పదాన్ని ప్రయోగించిన ప్రతిచోటా, అన్నిచోట్లా దాని ఏ అర్థమూ సరిగ్గా అతకదు. ఒరైజన్ (ORIGEN) దీన్ని ఒక చోట Consolator అని అనువదిస్తే మరోచోట Deprecator అని చేశాడు. కాని ఇతర వ్యాఖ్యాతలు ఈ రెండు అనువాదాలనూ త్రోసిపుచ్చారు. ఎందుకంటే, ప్రథమంగా గ్రీకు వ్యాకరణాన్ని అనుసరించి ఇవి సరయినవి కావు. రెండవదిగా, ఈ పదం ప్రయోగించబడిన ప్రతిచోటా ఈ అర్థం చెల్లదు. కొందరు అనువాదకులు దీన్ని Teacher అని అనువదించారు. కాని గ్రీకు భాష ప్రయోగాలనుబట్టి ఈ అర్థమూ గ్రహించలేము. తర్తూలియాన్, అగస్టయిన్ దీనికి బదులు Advocate అన్న పదానికి ప్రాధాన్యం ఇచ్చారు.

మరికొందరు Assistant అనీ Comforter అనీ Consoler అనీ పదాలు ప్రయోగించారు.

(చూడండి, ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బిబ్లికల్ లిటరేచర్ – పెరాక్లీటస్ Paracletus అన్న పదం).

(6) ఆసక్తికరమయిన విషయం ఏమిటంటే గ్రీకు భాషలోనే మరో పదం Periclytos అనేది ఉంది. దీని అర్థం ఆశంసించబడిన, ప్రశంసించబడిన అని వస్తుంది. ఈ పదం పూర్తిగా "ముహమ్మద్" అన్న పదానికి సమానార్థకమయినది. ఉచ్చారణలో దీనికీ మరి Paracletus అనే దానికీ చాలా పోలిక ఉంది. క్రైస్తవ మహనీయులు తమ ధార్మిక గ్రంథాలలో తమ అభీష్టానికి, రుచికీ అనుగుణంగా నిస్సంకోచంగా మార్పులు చేర్పులు చేసివేసేందుకు బాగా ఇచ్ఛగించేవారు. వారు యోహాను ఉటంకించిన భవిష్యవాణిలోని ఈ పదాన్ని తమ విశ్వాసానికి వ్యతిరేకమయినదని గమనించి దాని పద నిర్మాణంలో స్పెల్లింగులో ఈ కాస్త మార్పు చేసి ఉన్నా, అది ఏమంత ఊహాతీతమయిన విషయం కాదు. దాన్ని శోధించడానికి యోహాను వ్రాసిన ప్రారంభ గ్రీకు సువార్త కూడా ఎక్కడా లేదు, దాని ద్వారానయినా అక్కడ ఈ రెండు పదాలలో ఏ పదం వాస్తవంగా ప్రయోగించబడిందో చూసి నిర్ధారించడానికి.

(7) కాని తుది నిర్ణయం, యోహాను గ్రీకు భాషలో నిజానికి ఏ పదం ప్రయోగించాడన్న విషయం ఆధారంగానూ జరగజాలదు, ఎందుకంటే, అది కూడా, ఏది ఏమయినా, అనువాదమే. మహనీయ ఈసా (అ) భాష, మేము పైన తెలిపినట్లు పాలస్తీనాలో మాటలాడే సిరియాక్ భాష. అందువల్ల ఆయన తన భవిష్యవాణి లేదా శుభవార్తలో ప్రయోగించిన పదం తప్పనిసరిగా ఏదో సిరియాక్ పదమే కాగలదు. అదృష్టంకొద్ది ఆ సిరియాక్ పదం మనకు 'ఇబ్ను హిషామ్' విరచితమయిన

ప్రవక్త జీవిత చరిత్ర గ్రంథంలో దొరుకుతుంది. దానితోపాటు ఈ గ్రంథం ద్వారానే దాని సమానార్థకమయిన గ్రీకు పదం ఏదో కూడా తెలిసి పోతుంది. ముహమ్మద్ బిన్ ఇస్హాక్ ద్వారా ఇబ్ను హిషామ్, యోహాను (అరబీలో యుహన్నస్) సువార్త, 15వ అధ్యాయం, వచనం 23 - 27 వరకు, 16వ అధ్యాయం తొలి ఆయత్ అనువాదాన్ని పూర్తిగా ఉటం కించారు. అందులో గ్రీకు పదం 'ఫార్కలీత్' (Paracletus) కు బదులు సిరియాక్ భాష పదం "మున్హమన్నా" ప్రయోగించబడింది. ఆపైన ఇబ్ను ఇస్హాక్ లేదా ఇబ్ను హిషామ్ దాన్ని వివరిస్తూ "మున్ హమన్నా" అన్న సిరియాక్ భాష పదానికి "ముహమ్మద్" అనీ, గ్రీకులో "బరిక్లీతుస్" (Periclytos) అనీ అర్థమని వ్రాశారు. (ఇబ్ను హిషామ్, సం. 1, పు. 248)

ఇక కాస్త గమనించండి; చారిత్రకంగా చూస్తే పాలస్తీనాలోని సామాన్య క్రైస్తవ పౌరుల భాష క్రీ.శ. 9వ శతాబ్ది వరకు సిరియాక్ భాషే. ఈ ప్రాంతం 7వ శతాబ్ది తొలి అర్ధభాగం నుండి ఇస్లామీయ సామ్రాజ్యంలో చేరింది. ఇబ్ను ఇస్హాక్ క్రీ.శ. 768లోనూ, ఇబ్ను హిషామ్ 828లోనూ మృతిచెందారు. దీని భావం, వీరిరువురి కాలంలో పాలస్తీనా క్రైస్తవులు సిరియాక్ భాష మాటలాడేవారు. వీరిరువురికి తమ దేశంలోని క్రైస్తవ ప్రజలతో సంబంధం ఏర్పరచుకోవడం ఏమాత్రం కష్టం కాదు. ఇంకా ఆ కాలంలో గ్రీకు మాటలాడే క్రైస్తవులు లక్షల సంఖ్యలో ఇస్లామీయ సామ్రాజ్యంలో నివసిస్తూ ఉండేవారు. అందువల్ల ఏ 'సిరియాక్' పదానికి సమానార్థకమయిన 'గ్రీకు' పదం ఏదో తెలుసుకోవడమూ వారికి కష్ట మయిన పనికాదు. ఇబ్ను ఇస్హాక్ ఉటంకించిన అనువాదంలో సిరియాక్ పదం 'మున్హమన్నా' ప్రయోగించినట్లయితే, ఇబ్ను ఇస్హాక్ లేదా ఇబ్ను హిషామ్ దాని విశదీకరణలో దానికి అరబీ సమానార్థక పదం

'ముహమ్మద్' అనీ, గ్రీకులో "బరీక్లితుస్" అనీ వ్రాస్తే ఇక హజ్రత్ ఈసా (అ) ప్రవక్తశ్రీ (స) పేరు పలికి ఆయన రాకకు సంబంధించిన శుభవార్తనే ఇచ్చారన్న విషయంలో ఎటువంటి సందేహం మిగులదు. దీనితో పాటు యోహానుకు చెందిన గ్రీకు సువార్తలో అసలు, Periclytos అనే పదమే ప్రయోగించబడిందని, క్రైస్తవ మహాశయులు తరువాత ఎప్పుడో దాన్ని కాస్తా Paracletus గా మార్చి ఉంటారనీ తేలిపోతుంది.

(8) ఇంతకన్నా ప్రాచీనమయిన చారిత్రక సాక్ష్యాధారం, హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఉల్లేఖనం, దాని ప్రకారం, అబీసీనియాకు వెళ్ళిన ముహాజిరులను నజ్జాషీ తన కొలువులో పిలిపించినపుడు, మహనీయ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర) ద్వారా దైవసందేశహరులు (స) బోధించిన ఉపదేశాలు అతను విన్నాడు. అప్పుడు అతను ఇలా అన్నాడు: "శుభా కాంక్షలు మీకు, మీరు ఏ వ్యక్తి వద్ద నుండి వచ్చారో ఆ వ్యక్తికీ. ఆయన దైవ సందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను. మేము సువార్తలలో ఎవరి ప్రస్తావననయితే గమనించామో ఆయనే ఈయన. మర్యమ్ కుమారుడు ఈసా (అ) ఎవరిని గురించి శుభవార్త నందజేశారో ఆయనా ఈయనే" (ముస్నద్ అహ్మద్). ఈ గాథ స్వయంగా హజ్రత్ జాఫర్, హజ్రత్ ఉమ్మె సలమ ద్వారా కూడా ఉటంకించబడింది. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే, క్రీ.శ. 7వ శతాబ్ది ప్రారంభంలో నజ్జాషీకు తెలుసు, హజ్రత్ ఈసా (అ) ఒక ప్రవక్తను గురించి భవిష్యవాణి పలికి ఉన్నారని. అంతేకాదు, ఆ ప్రవక్తకు సంబంధించిన స్పష్టమయిన సంకేతం కూడా సువార్తలలో ఉండేదనీ రుజువవుతుంది. దీని కారణంగానే ఆ ప్రవక్తే ముహమ్మద్ (స) అన్న అభిప్రాయానికి రావడంలోనూ నజ్జాషీకి ఏమాత్రం కష్టం కలగలేదు. అయితే ఈ ఉల్లేఖనం ద్వారా, హజ్రత్ ఈసా (అ) ఇచ్చిన శుభవార్తను గురించి నజ్జాషీకి ప్రాప్తమయిన ఆధారం, యోహాను సువార్తయేనా లేదా

మరేదయినా వేరే ఆధారం ఆ కాలంలో ఉండేదా అన్న విషయం మటుకు తెలదు.

(9) వాస్తవమేమిటంటే, కేవలం దైవసందేశహరుల (స) ను గురించి, మహనీయ హజ్రత్ ఈసా (అ) భవిష్యవాణులు మటుకే కాదు, స్వయంగా హజ్రత్ ఈసా (అ) సరయిన జీవన విశేషాలు, పరిస్థితులు, ఆయన నిజ బోధనలను గురించి తెలుసుకునే విశ్వసనీయమయిన ఆధారం ఆ నాలుగు సువార్తలు కావు. వాటినే క్రైస్తవ చర్చ్ విశ్వస నీయమయిన గుర్తింపు పొందిన సువార్తలు (Canonical Gospels) గా నిర్ణయించింది. నిజానికి వీటికి ఇతోధిక విశ్వసనీయ మయిన ఆధారం **బర్నబా సువార్త.** దాన్ని చర్చ్ వ్యవస్థ చట్టబద్ధం కాదని, సందేహాస్పదం (Apocryphal) అయినదనీ ప్రకటించింది. క్రైస్తవులు దాన్ని దాచిపెట్టడానికి సకల ప్రయత్నాలూ చేశారు. శతాబ్దుల తరబడి ఇది ప్రపంచంలో కానరాకుండా పోయింది. 16వ శతాబ్దిలో దీని ఇటాలియన్ అనువాదం ఒక్క ప్రతి మటుకు పోప్ సిక్స్టస్ (Sixtus) గ్రంథాలయంలో దొరికింది. ఎవరికీ దాన్ని చదివే అనుమతి లేకపోయింది. 18వ శతాబ్ది ప్రారంభంలో అది జాన్ టూలెండ్ అనే వ్యక్తి చేజిక్కింది. తరువాత విభిన్న చేతులు మారుతూ 1738లో వియన్నాలోని ఇంపీరియల్ లైబ్రరీలోకి చేరింది. 1907లో దాని ఇంగ్లీషు అనువాదం ఆక్స్ఫర్డ్‌లోని 'క్లియరండన్ ప్రెస్' నుండి వెలువడింది కూడా. అయితే దాని ప్రచురణ తరువాత వెంటనే క్రైస్తవ ప్రపంచంలో చలనం వచ్చింది. హజ్రత్ ఈసా(అ) పేరిట ప్రచారం జరుగుతున్న మతాన్ని ఈ గ్రంథం సమూలంగా అంతమొందిస్తుందన్న భావం వారిలో కలిగింది. అందువల్ల దాని ముద్రితమయిన ప్రతులన్నీ ఏదో ప్రత్యేక పద్ధతి ద్వారా మాయం చేసివేశారు. తరువాత ఎన్నడూ అది ప్రచురణకు నోచుకోలేదు. మరో ప్రతి

ఆ ఇటాలియన్ అనువాదం నుండి స్పెయిన్ భాషలోకి అనూదితమయినది 18వ శతాబ్దిలో దొరికేది. దాని ప్రస్తావన 'జార్జ్‌సీల్' తన, దివ్య ఖుర్ఆన్ ఇంగ్లీషు అనువాదం ఉపోద్ఘాతంలో చేశాడు. కాని అది కూడా ఎక్కడో మాయమయిపోయింది. నేటికీ దాని ఆచూకి ఏదీ ప్రాప్తమవదు. ఆక్స్‌ఫర్డ్ నుండి ప్రచురించబడిన ఇంగ్లీషు అనువాదానికి ఫోటో స్టాట్ కాపీ ఒకటి చూసే అవకాశం నాకు కలిగింది. నేను దాని ఒక్కొక్క పదాన్నీ చదివాను. నా దృష్టిలో అదొక మహా భాగ్యం, వరప్రసాదం, క్రైస్తవులు కేవలం దురభి మానం చేత, మంకుపట్టు కారణంగా తమ్ముతాము దానికి వంచితులయి పోయారు.

క్రైస్తవ సాహిత్యంలో ఎక్కడయినా దీని ప్రస్తావన వస్తే అక్కడ దాన్ని ఒక కాల్పనిక బూటకపు సువార్త అంటూ కొట్టిపారవేయడం జరుగుతుంది. దాన్ని బహుశా ఎవరో ముస్లిమ్ వ్యక్తి రచించి బర్నబాతో దాన్ని ముడిపెట్టాడని ప్రచారం చేశారు. కాని ఇదొక మహా అసత్యం. ఈ అబద్ధం పలకడానికి కారణం కేవలం ఒక్కటే. ఆ గ్రంథంలో పలుచోట్ల చాలా విశదంగా ప్రవక్త మహనీయులు (స) ను గురించి భవిష్యవాణులు దొరుకుతాయి. కాబట్టి ఈ అబద్ధం కల్పించడం జరిగింది. మొదట ఈ సువార్తను చదవగానే తెలిసే విషయం, ఈ గ్రంథం ఏ ముస్లిమ్ వ్యక్తి చేత రచింపబడలేదన్నది. రెండవ విషయం, దీన్ని ఎవరయినా ముస్లిమ్ వ్యక్తి రచించి ఉన్నట్లయితే ముస్లిముల్లో ఇది బాగా ప్రచారంలో ఉండేది. ఇస్లామీయ పండితుల రచనల్లో తరచుగా దీని ప్రస్తావన వచ్చేది. కాని ఇక్కడ పరిస్థితి ఏమిటంటే, జార్జ్ సీల్ చేసిన ఖుర్ఆన్ ఇంగ్లీష్ అనువాదా నికి ఉపోద్ఘాతంలో వచ్చిన ప్రస్తావనకు పూర్వం ముస్లిములకు దాని ఉనికిని గురించి కూడా తెలియదు. తబరీ, యాకూబీ, మస్ఊదీ, అల్ బైతూనీ, ఇబ్ను హజ్మ్, తదితర రచయితలు, ముస్లిముల్లో ఇతోధికంగా

క్రైస్తవ సాహిత్యాన్ని గురించి బాగా ఎరిగినవారు. వీరిలో ఏ ఒక్కరి రచన లోనూ క్రైస్తవ మతాన్ని చర్చించినప్పుడు బర్నబా సువార్తను గురించి సంకేతం కూడా కానరాదు. ఇస్లామీయ ప్రపంచంలోని గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాల పట్టికలు అత్యుత్తమ రీతిలో సంకలనం చేసినవి ఉన్నాయి. ఇబ్ను నదీమ్ వ్రాసిన "అల్ ఫిహ్రిస్త్" హాజీ ఖలీఫా విరచితమయిన "కషఫుజ్జునూన్" ఉన్నాయి. వాటిలోనూ దీని ప్రస్తావన లేదు. 19వ శతాబ్దికి పూర్వం ఏ ముస్లిమ్ పండితుడు కూడా బర్నబా సువార్త పేరు కూడా ఎత్తలేదు. మూడవ విషయం, ఈ మాట అబద్ధమనడానికి అన్నిం టికన్నా పెద్ద రుజువు ఏమిటంటే, ప్రవక్త మహనీయులు (స) పుట్టుకకు కూడా 75 సంవత్సరాలకు మునుపే పోప్ గ్లాసియస్ (Gliasius-I) కాలంలో తప్పుడు విశ్వాసం గల మార్గవిహీనమయిన (Heretical) పుస్తకాల పట్టిక ఒకటి తయారయింది. ఒక పోప్ ఆదేశం (ఫత్వా) ద్వారా వాటిని చదవడం ధర్మవిరుద్ధంగా ప్రకటించడం జరిగింది. వాటిలో బర్నబా సువార్త (Evangelium Barnabe) కూడా ఒకటుంది. ప్రశ్న ఏమిటంటే, ఆ కాలంలో ఉన్న ముస్లిమ్ వ్యక్తి ఎవడు, ఈ బూటకపు సువార్త తయారుచేయడానికి? ఒక మాటనయితే స్వయంగా క్రైస్తవ పండితులు అంగీకరించారు. సిరియా, స్పెయిన్, ఈజిప్ట్ తదితర దేశాల లోని ప్రారంభ క్రైస్తవ చర్చీలలో చాలాకాలం వరకు బర్నబా సువార్త చెలామణిలో ఉండేదని, ఆరవ శతాబ్దిలోనే దాన్ని నిషేధించడం జరిగిందని వారు అంగీకరించారు.

(10) ఈ సువార్త నుండి ప్రవక్త మహనీయులు (స) విషయంలో హజ్రత్ ఈసా (అ) శుభవార్తలను ఉటంకించడానికి ముందు దాన్ని క్లుప్తంగా పరిచయం చేయడం అవసరం. అప్పుడే దాని ప్రాముఖ్యత

తెలిసివస్తుంది. ఇంకా క్రైస్తవ మహాశయులు దాన్ని గురించి ఇంతగా ఆగ్రహం కలిగి ఉండటానికి కారణమేదో కూడా బోధపడుతుంది.

బైబిల్ (పరిశుద్ధ గ్రంథం) లో చట్టపరమయినవిగా, విశ్వసనీయ మయినవిగా పరిగణించి చేర్చబడిన నాలుగు సువార్తలలో దేన్ని వ్రాసిన వారయినా హజ్రత్ ఈసా (అ) సహచరులు కారు. వారిలో ఏ ఒక్కరు కూడా ఆ మహనీయుని సహచరుల ద్వారా సేకరించిన సమాచారాలే తమ సువార్తల్లో నమోదుచేశామని వాదించనూ లేదు. తాము ఏ మూలాల నుండి సమాచారాన్ని సేకరించిందీ వారు ఎక్కడా పేర్కొనలేదు. అలాగయినా, ఉల్లేఖకుడు తాను చెప్పే విషయాలను గురించి తాను స్వయంగా ఆ సంఘటనలు చూశాడో, ఆ మాటలు విన్నాడో లేదా కొన్ని మాధ్యమాల ద్వారా ఆ విషయాలు తన వరకు చేరాయో తెలిసివచ్చేది. దీనికి భిన్నంగా బర్నబా సువార్త రచయిత చెబుతున్నాడు, తాను స్వయంగా క్రీస్తు ప్రథమ శిష్యులయిన పన్నెండు మందిలో ఒక్కణ్ణి, తొలి నుంచి తుది వరకు క్రీస్తు వెంటనే ఉన్నానని, కళ్ళారా చూసిన ఘటనలు, చెవులారా విన్నమాటలనే ఈ గ్రంథంలో నమోదుచేస్తున్నానని అన్నాడు. అంతేకాదు, గ్రంథం చివరలో అతను ఇలా అంటాడు, ప్రపంచం నుండి సెలవు తీసుకుంటూ మహనీయ క్రీస్తు, తన గురించి ప్రజల్లో వ్యాపించిన అపోహలను, అపార్థాలను తొలగించవలసిందని, సరయిన పరిస్థితుల్ని ప్రపంచం సమక్షంలో తీసుకురావలసిందని పురమాయించారని, అది నా బాధ్యతగా అప్పగించారని కూడా చెబుతాడు.

ఈ బర్నబా ఎవరు? బైబిల్‌లో "అపోస్తలుల కార్యములు" అనే గ్రంథంలో ఈ పేరు గల వ్యక్తి ప్రస్తావన విరివిగా వస్తుంది. (4:36, 9:27, 11:22, 11:30, 12:25, 13:1, 2, 7, 46, 50; 14:12, 14, 20; 15:2, 12, 22, 26, 35, 36, 37, 38). ఇతను కుబ్రోస్ (కుప్ర)

లోని ఒక యూదు (లేవీయ) కుటుంబానికి చెందినవాడు. క్రైస్తవం వ్యాప్తి, క్రైస్తవ అనుయాయులకు సహాయ సహకారాల విషయంలో ఇతని సేవలను చాలా ప్రశంసించడం జరిగింది. కాని అతను క్రైస్తవ మతంలో ఎప్పుడు ప్రవేశించాడో ఎక్కడా తెలుపడం జరగలేదు. మూడు సువార్తలలో ఇచ్చిన తొలి 12 మంది శిష్యుల జాబితాలో ఇతని పేరు ఎక్కడా వ్రాయ బడిలేదు. అందువల్ల ఈ ప్రస్తావిత సువార్త రచయిత (పైన పేర్కొన్న) ఆ బర్నబాయేనా లేదా మరొకడా అని చెప్పలేము. మత్తయి, మార్కు తమ సువార్తలలో ఏ శిష్యుల (apostles) పేర్ల జాబితా ఇచ్చారో దానికీ బర్నబా ఇచ్చిన జాబితాకి రెండు పేర్ల విషయంలో విభేదముంది. ఒకటి, 'తోమా'. దానికి బదులు బర్నబా స్వయంగా తన పేరు ప్రస్తావిస్తున్నాడు. రెండవది, షమ్ఊన్ కనాఫీ. ఇతని స్థానంలో అతను యాకూబు కుమారుడు యహూదా పేరు ప్రస్తావిస్తున్నాడు. లూకా సువార్తలో ఈ రెండవ పేరు కూడా ఉంది. అందువల్ల, తరువాత ఎప్పుడో ఒకసారి, కేవలం బర్నబాను శిష్యులలో నుండి తొలిగించడానికి తోమా పేరు చేర్చ బడినదని ఊహించడం సరయినదిగానే అనిపిస్తోంది. ఇలా అతని సువార్తను కూడా వదిలించుకోవచ్చు అని ఊహించి ఉంటారు. ఇటువంటి మార్పులు తమ మత గ్రంథాలలో చేసుకోవడం ఈ మహనీయులకు అధర్మమయిన పనేమీ కాదు.

ఈ సువార్తను ఎవరయినా ఎటువంటి పక్షపాత బుద్ధి లేకుండా కళ్ళు తెరచి చదివి, కొత్త నిబంధనలోని నాలుగు సువార్తలనూ దీనితో పోల్చి చూసినట్లయితే అతను ఒకటి తప్పక గ్రహించి తీరుతాడు. ఇది ఆ నాలుగింటికన్నా ఎన్నో విధాలా మెరుగ్గా ఉందని గ్రహిస్తాడు. ఇందులో హజ్రత్ ఈసా (అ) జీవిత వివరాలు అధిక వివరణలతో పేర్కొనబడ్డాయి. ఒక వ్యక్తి అక్కడ అంతా చూస్తున్నట్లు, ఆ సంఘటనల్లో స్వయంగా

పాల్గొంటున్నట్లు వివరించబడ్డాయి. నాలుగు సువార్తల సంబంధ రహిత మయిన గాధలకు ప్రతిగా ఈ చారిత్రక వివరణ అత్యధిక క్రమబద్ధంగానూ ఉంది. దీనిద్వారా సంఘటనల పరంపర బాగా క్షుణ్ణంగా బోధపడుతుంది కూడా. మహనీయ ఈసా (అ) బోధనలు ఇందులో నాలుగు సువార్తల కన్నా ఇతోధిక విశదంగా, వివరంగా, ప్రభావవంతంగా వెల్లడించబడ్డాయి. దేవుని ఏకత్వపు బోధన, బహుదైవారాధన ఎడల ఖండన, దేవుని గుణ గణాలు, ఆరాధనల సారం, అత్యుత్తమ నైతికతల విషయాలు ఇందులో బలోపేతంగా, నిదర్శనా పూర్వకంగా, సవివరంగా పేర్కొనబడ్డాయి. ఇందులో ఈ విషయాలు ఎటువంటి గుణపాఠం గరిపే ఉపమానాలతో మహనీయ క్రీస్తు (అ) బోధించారో దాని ఏ లేశమయిన అంశమూ నాలుగు సువార్తలలో కానరాదు. మహనీయ ఈసా (అ) తన శిష్యుల బోధన, శిక్షణలు ఎంత విజ్ఞతతో, ఔచిత్యరీతిలో చేసేవారో అన్న విషయమూ దీనిద్వారానే సవివరంగా తెలుస్తోంది. మహనీయ ఈసా (అ) భాష తీరు, భావప్రకటనా విధానం, నైజం, ప్రకృతి ఇత్యాది విషయాలను గురించి ఏమాత్రం పరిచయమున్న వ్యక్తి, అతను ఈ సువార్తను చదివి, ఇదేదో తరువాత కల్పించుకున్న బూటకపు నకిలీ గాధ కాదని నమ్మడానికి వివశుడయి పోతాడు. పైగా ఇందులో మహనీయ క్రీస్తు, నాలుగు సువార్తలలో కన్నా తన నిజ స్వరూప ఔన్నత్యంలో చాలా ఉజ్వలంగా మనముందు ప్రత్యక్షమవుతారు. ఇంకా ఇందులో, నాలుగు సువార్తలలోని భిన్నమయిన సూక్తుల మధ్య ఉన్న వైరుధ్యం, ఛాయామాత్రంగా కూడా కానరాదు.

ఈ సువార్తలో మహనీయ ఈసా (అ) జీవితం, ఆయన బోధనలు, సరిగ్గా ఒక ప్రవక్త జీవితం, బోధనల కనుగుణంగా దర్శనమిస్తాయి, మరాయన ఒక ప్రవక్తగా కానవస్తారు; మునుపటి ప్రవక్తలు, గ్రంథాలను

ధ్రువపరుస్తారు. దైవప్రవక్తల బోధనలు తప్ప సత్యజ్ఞానం పొందే మార్గం మరేదీ లేదని అతి స్పష్టంగా చెబుతారు. ఎవరయితే దైవప్రవక్తలను కాదంటాడో అతను వాస్తవంగా దైవాన్నే కాదంటాడు అని అంటారు. దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోక జీవితాలకు సంబంధించిన విశ్వాసాలు సరిగ్గా మిగతా ప్రవక్తలందరు బోధించిన వాటినే అంద జేస్తారు. నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), జకాత్ (అగత్యపరుల హక్కు)ను ఉపదేశిస్తారు. ఆయన ప్రార్థనల ప్రస్తావన అనేక చోట్ల బర్నబా చేసినదాన్ని బట్టి చూస్తే ఈ ఫజ్ర్ (సూర్యోదయానికి పూర్వం), జుహ్ర్ (మధ్యాహ్నం తరువాత), అస్ర్ (సాయంత్రం), మగ్‌రిబ్ (సూర్యాస్తమయం తరువాత), ఇషా (రాత్రి ప్రవేశించిన తరువాత), తహజ్జుద్ (నడిరేయి తరువాత) సమయాల్లోనే ఆయన నమాజ్ చేసేవారని తెలుస్తోంది. నమాజ్‌కు ముందు ఎల్లప్పుడూ వుజూ చేసేవారు. ప్రవక్తలలో ఆయన హజ్రత్ దావూద్, సులైమాన్‌లను సయితం ప్రవక్తలుగా పరిగణిం చారు. మరి యూదులూ క్రైస్తవులు వారిని ప్రవక్తల జాబితా నుండి తొలగించి వేశారు. హజ్రత్ ఇస్మాయీల్ (అ)ని ఆయన 'జబీహ్' (దైవ మార్గంలో జుబ్హ్ అయినవారు) గా నిర్ణయిస్తారు. ఒక యూదు పండితుని చేత, నిజానికి 'జబీహ్' హజ్రత్ ఇస్మాయీల్ (అ) అనీ, బనీ ఇస్రాయీల్ అనవసరంగా బలవంతాన మరీ సాగదీసి హజ్రత్ ఇస్‌హాక్‌ని 'జబీహ్' చేసిపెట్టారని ఒప్పిస్తారు. పరలోకం, ప్రళయం, స్వర్గం, నరకం ఇత్యాది విషయాలను గురించి ఆయన బోధనలు, దాదాపు దివ్య ఖుర్‌ఆన్‌లో బోధించబడినవే కానవస్తాయి.

(11) క్రైస్తవులు బర్నబా సువార్తకు వ్యతిరేకులవడానికి నిజమయిన కారణం, అందులో దైవసందేశహరులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) గురించి పలుచోట్ల స్పష్టమయిన శుభవార్తలుండటం కాదు, ఎందుకంటే,

వారు ప్రవక్తశ్రీ (స) పుట్టుకకు చాలాకాలం ముందే ఈ సువార్తను రద్దు పరిచారు. వీరి అయిష్టానికి అసలు కారణం అర్థం చేసుకునేందుకు కాస్త వివరమయిన చర్చ అవసరం.

హజ్రత్ ఈసా (అ) ప్రారంభ శిష్యులు ఆయన్ని కేవలం ప్రవక్త (నబీ)గా నమ్మేవారు. మూసా (అ) షరీఅత్‌ని అనుసరించేవారు, విశ్వాసాలు, ఆదేశాలు, ఆరాధనల విషయంలో తమ్ముతాము ఇతర బనీ ఇస్రాయీల్‌కు వేరని ఎంతమాత్రం భావించేవారు కారు. యూదులతో వారి విభేదం కేవలం ఒక్క విషయంలోనే. వీరు హజ్రత్ ఈసా (అ)ని క్రీస్తు (మసీహ్) గా అంగీకరించి ఆయన్ని విశ్వసించారు. మరి వారేమో ఆయన్ని 'మసీహ్'గా నమ్మడానికి నిరాకరించేవారు. తరువాత సెయింట్ పాల్ (పౌలు) ఈ సముదాయంలో చేరినప్పుడు, అతను రోమనులు, గ్రీకులు, తదితర యూదేతర, ఇస్రాయీలేతర జనుల్లోనూ ఈ ధర్మ ప్రచారం ప్రారంభించాడు. ఈ అవసరానికి గాను మరో కొత్త ధర్మాన్ని రూపొందించాడు. దాని విశ్వాసాలు, సిద్ధాంతాలు, ఆదేశాలు హజ్రత్ ఈసా (అ) అందజేసిన ధర్మానికి పూర్తిగా భిన్నమయినవి, ఈ వ్యక్తి హజ్రత్ ఈసా (అ) సాంగత్యం, సహచర్యం పొందలేదు. ఆయన కాలంలో పచ్చి విరోధి. ఆయన తరువాత కూడా చాలా కాలం వరకు ఆయన అనుయాయుల విరోధిగానే ఉండేవాడు. ఆ తరువాత ఈ సముదాయంలో చేరి ఒక కొత్త ధర్మాన్ని రూపొందించ మొదలెట్టినప్పుడు కూడా అతను మహనీయ ఈసా (అ) సూక్తిని దేన్నీ ప్రమాణంగా చూపలేదు. తన ప్రేరణ, ఆధ్యాత్మిక ఆవిష్కరణలనే ఆధారాలుగా చూపాడు. ఈ క్రొత్త ధర్మం నిర్మాణంలో అతని ముందున్న లక్ష్యం, ఈ ధర్మాన్ని సాధారణ యూదేతర (Gentile) ప్రపంచం కూడా స్వీకరించాలన్నది మటుకే. ఒక క్రైస్తవుడు యూదు ధర్మశాస్త్ర బంధనాలన్నింటి నుండి విముక్తుడని ప్రకటించాడు. అతను

అన్నపానీయాలలో ధర్మాధర్మాల సకల ఆంక్షలను అంతమొందించాడు. అతను 'సున్నతీ' ఆదేశాన్ని రద్దుపరిచాడు. అది యూదేతర ప్రపంచానికి ప్రత్యేకంగా ఇష్టముండేది కాదు. కడకు అతను, క్రీస్తు దైవత్వాన్ని, ఆయన దైవ కుమారుడవడాన్నీ, శిలువపైన ప్రాణాలు వదలి, ఆదమ్ సంతానం చేసిన ఆజన్మ పాపానికి పరిహారం ఇవ్వడం వంటి విశ్వాసాన్నీ కల్పించాడు. ఇది సాధారణ బహుదైవారాధకుల మనస్తత్వానికి బాగా అనుకూలంగా ఉండేది. క్రీస్తు ప్రారంభ శిష్యులు ఈ కొత్త విషయాలను గట్టిగా ప్రతిఘటించారు. కాని సెయింట్‌పాల్ తెరచిన ద్వారం గుండా యూదేతర క్రైస్తవుల వెల్లువ ఒకటి బలవత్తరంగా ఈ మతంలో ప్రవేశించింది. దీనికెదురుగా ఆ పిడికెడు మంది ఏ విధంగానూ నిలవలేకపోయారు. అయినప్పటికీ క్రీ.శ. మూడవ శతాబ్ది అంతం వరకు క్రీస్తు దైవత్వపు విశ్వాసాన్ని తిరస్కరించేవారు చాలా మంది ఉండేవారు. కాని నాల్గవ శతాబ్ది ప్రారంభం (325)లో 'నీకయ్య (Nicaea)' లో జరిగిన కౌన్సిల్, పౌలు అందజేసిన విశ్వాసాలను ప్రామాణికంగా క్రైస్తవానికి చెందిన ధ్రువీకృత మతంగా నిర్ణయించింది. తరువాత రోమను ప్రభుత్వం స్వయంగా క్రైస్తవం స్వీకరించింది. కైసరు థియోడోసిస్ కాలంలో ఈ మతమే రాజ్యానికి ప్రభుత్వ ఆమోదిత మతంగా రూపొందింది. ఆ తరువాత ఈ విశ్వాసానికి విరుద్ధమయిన గ్రంథాలన్నీ రద్దయినవిగా పరిగణించబడటం, ఈ విశ్వాసానికి అనుగుణంగా ఉన్న గ్రంథాలను మటుకే విశ్వసనీయమయినవిగా పరిగణించడం సహజంగానే జరిగింది. క్రీ.శ. 367లో తొలిసారిగా అథానాసియూస్ (Athanasius) లేఖద్వారా విశ్వసనీయమయిన, ఆమోదిత గ్రంథాల ఒక సంగ్రహాన్ని ప్రకటించటం జరిగింది. ఆ తరువాత దాన్ని క్రీ.శ.382లో పోప్, డెమసియస్ (Damasius) అధ్యక్షతన జరిగిన ఒక సభ దాన్ని ధ్రువీకరించింది.

అయిదవ శతాబ్ది చివర పోప్ గిలాసియస్ (Gelasius) ఈ సంగ్రహాన్ని ఆమోదిత / గుర్తింపు పొందినదిగా ప్రకటించడంతోపాటు, గుర్తింపు పొందని, అనామోదిత గ్రంథాల జాబితాను సయితం సంకలనం చేశాడు. నిజమేమిటంటే, పౌలు చెప్పిన ఏ విశ్వాసాల ఆధారంగా మత గ్రంథాలను విశ్వసనీయమయినవి, విశ్వసనీయం కానివిగా నిర్ణయించడం జరిగిందో వాటిని గురించి ఎన్నడూ ఏ క్రైస్తవ పండితుడూ, వాటిలో ఏ విశ్వాస మయినా స్వయంగా హ|జత్ ఈసా (అ) బోధించారని ప్రకటించలేక పోయాడు. నిజానికి విశ్వసనీయ గ్రంథాల సంగ్రహంలో ఏ సువార్తలయితే చేరి ఉన్నాయో, స్వయంగా వాటిలోనూ మహనీయ ఈసా (అ) తానే చెప్పిన ఏ సూక్తీ ఆ విశ్వాసాలకు ఆధారంగా ప్రాప్తం కాదు.

బర్నబా సువార్త ఆ అనామోదిత గ్రంథాల జాబితాలో చేర్చబడింది. ఎందుకంటే, అది క్రైస్తవం బోధించే ఆ అంగీకృత విశ్వాసానికి పూర్తిగా విరుద్ధమయింది. దాని రచయిత గ్రంథం ప్రారంభంలోనే తన రచనా ఉద్దేశాన్ని ఇలా వివరిస్తాడు: "షైతాన్ వంచనకు గురయి ఏసును దైవ కుమారుడుగా నిర్ణయించే వారిని, 'సున్నతి'ని అనవసరమని పరిగణించే వారిని, నిషిద్ధ భోజనాలను ధర్మసమ్మతం చేసేవారిని - ఆ మోసపొయ్యే వారిలో పౌలు కూడా ఒకడు - వీరి ఆలోచనలను అభిప్రాయాలను సంస్కరించడం." అతను చెప్పేదాన్నిబట్టి, హ|జత్ ఈసా (అ) ప్రపంచంలో ఉన్న కాలంలో ఆయన మహిమలు చూసి తొలుత బహుదైవారాధకు లయిన రోమను సిపాయిలు ఆయన్ని దేవుడని, కొందరు దేవుని కుమారుడని చెప్పడం మొదలెట్టారు. తరువాత ఈ అంటువ్యాధి, బనీ ఇస్రాయీల్ సామాన్య జనులకు కూడా సోకింది. దానిపైన మహనీయ ఈసా (అ) ఎంతో ఆందోళన చెందారు. ఆయన మాటిమాటికీ ఎంతో తీవ్రంగా తనను గురించి ఈ తప్పుడు విశ్వాసాన్ని ఖండించారు. తన్ను

గురించి ఇటువంటి మాటలు పలికే జనులపైన అభిశాపం కురిపించారు. తరువాత ఆయన తన శిష్యులను యూదియా ప్రాంతమంతటా ఈ విశ్వాసాన్ని ఖండించడానికి పంపారు. ఆయన ప్రార్థన ఫలితంగా ఆయన శిష్యగణం చేత కూడా, స్వయంగా హజ్రత్ ఈసా (అ) ద్వారా జరిగిన మహిమలు జరిగాయి. ఈ మహిమలు చేసే వ్యక్తి దేవుడో, దైవ కుమారుడో అన్న తప్పుడు అభిప్రాయాన్ని వదలుకోవాలని అలా చేయడం జరిగింది. ఈ సందర్భంలో అతను హజ్రత్ ఈసా (అ)చేసిన సవివరమయిన ప్రసంగాలు ఉటంకించాడు. వాటిలో ఆయన ఎంతో తీవ్రంగా ఈ తప్పుడు విశ్వాసాన్ని ఖండించాడు. ఈ మార్గవిహీనత వ్యాపించడం కారణంగా ఆయన ఎంతగా ఆందోళన చెందారో పలుచోట్ల వివరిస్తాడు. పైగా అతను పౌలు ప్రతిపాదించిన క్రీస్తు (అ) శిలువపైన ప్రాణాలు వదిలారన్న విశ్వాసాన్ని అతి స్పష్టంగా ఖండిస్తాడు. అతను తాను కళ్ళారా చూసిన పరిస్థితుల్ని వివరిస్తాడు. వాటి ప్రకారం, ఇస్కరియోతు యూదా, యూదుల నాయకుడి నుండి లంచము గైకొని హజ్రత్ ఈసా(అ)ని బంధించడానికి సిపాయీలను తోడుకొని వచ్చినప్పుడు అల్లాహ్ ఆదేశం ప్రకారం నలుగురు దైవదూతలు ఆయన్ని లేపుకుని వెళ్ళిపోయారు. ఇస్కరియోతు యూదా ఆకారమూ, ధ్వనీ హజ్రత్ ఈసా (అ) లాంటివిగా చేయబడ్డాయి. శిలువపైన ఎక్కించబడినది అతనే గాని హజ్రత్ ఈసా కాదు. ఈ విధంగా ఈ గ్రంథం పౌలు రూపొందించిన క్రైస్తవం మూలాన్ని తెగ నరుకుతుంది. ఖుర్ఆన్ చెప్పినదాన్ని పూర్తిగా ధ్రువీకరిస్తుంది. నిజానికి ఖుర్ఆన్ అవతరణకు 115 ఏళ్ళముందు, ఆ గ్రంథంలోని ఈ వివరణల మూలంగానే క్రైస్తవ పాదరీలు దాన్ని తిరస్కరించి ఉన్నారు.

(12) ఈ చర్చ ప్రకారం, ఈ విషయాలు విశదమవుతాయి : బర్నబా సువార్త వాస్తవానికి నాలుగు సువార్తలకన్నా ఇతోధిక విశ్వసనీయ మయిన సువార్త. అది క్రీస్తు (అ) బోధనలు, ఆయన చరిత్ర, శీల స్వభావాలు, మాటలను సరయిన విధంగా వ్యక్తీకరిస్తుంది. ఈ సువార్త ద్వారా క్రైస్తవులు తమ విశ్వాసాలను సరిజేసుకునేందుకు, హజ్రత్ మసీహ్ నిజమయిన బోధనల్ని తెలుసుకునేందుకు తమకు దొరికిన అవకాశాన్ని కేవలం మొండితనం మూలంగా జారవిడుచుకున్నారు. ఇక మేము నింపాదిగా, దైవ సందేశహరులు (స)ను గురించి బర్నబా, హజ్రత్ ఈసా(అ) ద్వారా ఉల్లేఖించిన శుభవార్తలను ఉటంకించగలము. ఈ శుభవార్తల్లో ఒక్కో చోట హజ్రత్ ఈసా (అ) ప్రవక్తశ్రీ (స) పేరును ప్రస్తావిస్తున్నారు, కొన్నిచోట్ల "దైవ సందేశహరులు" అని పేర్కొన్నారు, ఒక్కోచోట ఆయన్ని "మసీహ్" అనీ పేర్కొన్నారు. ఒకచోట "ప్రశంస నీయుడు" (Admirable) అన్నారు. ఒక్కోచోట అతి స్పష్టంగా **"లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదు ర్రసూలుల్లాహ్"** అన్న అర్థాన్ని స్ఫురించే వాక్యాలను సెలవిచ్చారు. మేము వారి శుభవార్తల నన్నింటినీ ఉటంకిం చడం కష్టమే. ఎందుకంటే, అవి చాలా అధికంగా ఉన్నాయి. పలుచోట్ల విభిన్న శైలుల్లో, విభిన్న పూర్వాపరాల మధ్య వచ్చాయి. వీటిని సంగ్రహ పరిస్తే మంచి పుస్తకమే తయారవుతుంది. ఇక్కడ మేము కేవలం ఉదాహరణగా వాటిలో కొన్నింటిని మాత్రమే ఉటంకిస్తున్నాము :

> "దైవం ప్రపంచంలోకి పంపించిన ప్రవక్తలందరూ, వారి సంఖ్య ఒక లక్షా 44 వేలు, వారు శ్లేష (రెండర్థాల) భావంతో మాటలాడారు. కాని నా తరువాత సకల ప్రవక్తల, పవిత్ర జీవుల జ్యోతి రానున్నాడు, ఆయన ప్రవ

క్తలు చెప్పిన మాటల చీకటిపైన వెలుగును చిమ్మరిస్తాడు, ఎందుకంటే, అతను దైవ సందేశహరుడు."

(అధ్యాయం : 17)

"పరిసయ్యులు, లేవీయులు అడిగారు, నీవు క్రీస్తువు కాకపోతే, ఏలీయా కాకపోతే, మరో ప్రవక్తవూ కాకపోతే నీవు కొత్త బోధనలు ఎందుకు అందజేస్తున్నావు? నిన్ను నీవు క్రీస్తుకన్నా అధికంగా ఎందుకు చూపుతున్నావు? అని. ఏసు సమాధానంగా ఏ మహిమలనయితే దైవం నా చేత చేయిస్తున్నాడో అవి, దైవం కోరినదే నేను చెబుతున్నానన్న విషయాన్ని చాటుతున్నాయి. నిజానికి మీరు ప్రస్తావిస్తున్న ఆ (క్రీస్తు) కన్నా గొప్పవానిగా పరిగణించబడటానికి యోగ్యునిగా నన్ను నేను భావించను. మీరు ఎవరినయితే మసీహ్ (క్రీస్తు) అని అంటున్నారో, ఎవరయితే నాకు ముందే చేయబడ్డాడో, నా తరువాత రానున్నాడో, ఎవరయితే సత్య వచనాలు తీసుకు రానున్నాడో, అతని ధర్మానికి అంతు అంటూ ఉండదు. నేను దేవుని ఆ సందేశ హరుని మేజోళ్ళ బంధనాలు లేదా అతని పాద రక్షల పట్టీలను విప్పేందుకు కూడా అర్హుణ్ణి కాను."

(అధ్యాయం : 42)

"నిశ్చయంగా నేను మీకు చెబుతున్నాను, ఆవిర్భవించిన ప్రతి ప్రవక్త కేవలం ఒక్క జాతికి దేవుని కారుణ్య చిహ్నమయి ప్రభవించాడు. ఈ కారణంగా ఆ ప్రవక్తల బోధనలు ఏ జనుల వద్దకయితే వారు ఆవిర్భవింప జేయబడ్డారో ఆ ప్రజలు తప్ప మరెక్కడా ప్రచారం పొందలేదు. కాని దేవుని

సందేశహరుడు వచ్చినప్పుడు, దేవుడు అతనికి తన చేతి ముద్రను ఇచ్చి వేస్తాడన్నమాట. కడకు అతను ప్రపంచంలో అతని బోధనలు పొందిన జాతులన్నింటికీ మోక్షాన్ని, కారుణ్యాన్ని అందజేస్తాడు. అతను దేవుని నమ్మని జనులపైన అధికారసత్తా తీసుకువస్తాడు. ఆయన విగ్రహారాధనను సమూలంగా తుడిచిపెడతాడు, దానికి షైతాన్ మిక్కిలి ఆందోళన చెందుతాడు.

ఆ తరువాత తన శిష్యులతో ఒక సుదీర్ఘ సంభాషణలో హజ్రత్ ఈసా (అ), ఆయన బనీ ఇస్మాయీల్ నుండి వస్తాడని విశదపరుస్తారు.

(అధ్యాయం : 43)

"అందువల్ల నేను మీకు చెబుతున్నాను. దేవుని సందేశ హరుడు ఒక శోభ. దానివల్ల దైవం సృష్టించిన దాదాపు సమస్త వస్తువులకు ఆనందం కలుగుతుంది. ఎందుకంటే, ఆయన అవగాహన, బోధన, విజ్ఞత, శక్తి, దైవభీతి, ప్రేమ, జాగ్రత్త, నిష్ఠ వంటి విషయాల సారంతో అలంకృతుడయిన వాడు. ఆయన అనుగ్రహం, కారుణ్యం, న్యాయం, ధర్మ పరాయణత, సౌజన్యశీలత, సహిష్ణుతల సారంతో సంశోభితుడు. వీటిని ఆయన దేవుని ద్వారా, దైవం తన సృష్టిరాశుల్లో ఎవరికి ఈ సారాన్ని ప్రసాదించాడో వాటన్నింటికన్నా మూడు వంతులు అధికంగా పొందాడు. ఆయన ప్రపంచంలోకి వచ్చినపుడు ఎంత శుభప్రద మయిన సమయమది. నన్ను నమ్మండి, ఏ విధంగా ప్రతి ప్రవక్త ఆయన్ని చూశాడో నేనూ ఆయన్ని అదేవిధంగా చూశాను, ఆయన్ని గౌరవపరిచాను. ఆయన ఆత్మను

చూసియే దేవుడు ఆయనకు ప్రవక్తా బాధ్యతను ఇచ్చాడు. నేను ఆయన్ని చూసినపుడు నా ఆత్మ నెమ్మదితో నిండి పోయింది. అది ఇలా పలికింది, ముహమ్మద్, దైవం నీకు తోడుగా ఉండుగాక, నాకు నీ పాదరక్షల వారలు కట్టే యోగ్యత దైవం ప్రసాదించుగాక, నేను ఈ స్థానం పొందినా ఒక పెద్ద ప్రవక్తనయి, దేవుని ఒక పవిత్ర జీవినయి పోతాను." (అధ్యాయం : 44)

"(నేను వెళ్ళిపోవుట వలన) మీ మనస్సులు ఆందోళన చెందవద్దు. మీరు భయపడనూవద్దు. నేను మిమ్మల్ని పుట్టించలేదు. మనందరి సృష్టికర్త దేవుడు. మిమ్మల్ని ఎవరు పుట్టించాడో ఆయనే మిమ్మల్ని రక్షిస్తాడు. పోతే నా విషయం, ఇప్పుడు నేను ప్రపంచంలో ఆ దేవుని సందేశ హరుని కోసం మార్గం సుగమం చేయడానికి వచ్చాను. ఆయన ప్రపంచానికి మోక్షాన్ని తీసుకు వస్తాడు..... అంద్రెయ అన్నాడు, గురువా మాకు అతని గుర్తులు తెలుపు, మేము అతనిని గుర్తుపట్టడానికి. ఏసు సమాధా నంగా, ఆయన మీ కాలంలో రాడు, మీ తరువాత కొన్నేం డ్లకు వస్తాడు, అప్పటికి నా సువార్త రూపుమాపబడుతుంది. అతి కష్టంగా 30 మంది విశ్వాసులు మిగిలి ఉంటారు. అప్పుడు దైవం ప్రపంచం పైన కరుణ చూపుతాడు, తన సందేశహరుణ్ణి పంపుతాడు. అతని తలపైన తెల్లని మేఘ చ్ఛాయ ఉంటుంది. దాని వల్ల ఆయన దేవుని ఎంపిక గన్నవాడుగా గుర్తింపబడతాడు. అతని ద్వారా ప్రపంచానికి దైవజ్ఞానం ప్రాప్తమవుతుంది. ఆయన దైవాన్ని నమ్మని

వారికి వ్యతిరేకంగా చాలా బలంతోపాటు వస్తాడు. భువి నుండి విగ్రహారాధనను నిర్మూలిస్తాడు. మరి నాకు చాలా ఆనందంగా ఉంది, అతని ద్వారా మన దైవం గుర్తింప బడతాడు. ఆయన పవిత్రతను కొనియాడటం జరుగు తుంది. నా గురించి సత్యత ప్రపంచానికి వెల్లడవుతుంది. నన్ను మానవునికి మించి మరేమోగా పరిగణించేవారి ఎడల ప్రతీకారం తీర్చుకుంటాడు.... ఆయన ఒక సత్యతతో పాటు వస్తాడు. అది ప్రవక్తలు అందరూ తెచ్చిన సత్యత కన్నా అధికంగా స్పష్టమయి ఉంటుంది." (అధ్యాయం : 72)

"దైవంతో ప్రమాణం ఎరూషలేములోనూ, సొలమన్ ఆరాధనాలయంలోనూ చెయ్యబడింది, మరెక్కడో కాదు. నా మాట నమ్మండి, ఒక సమయం రానున్నది, అప్పుడు దేవుడు తన కారుణ్యం, మరో నగరాన అవతరింపజేస్తాడు, ఆపైన ప్రతి చోట ఆయన ఆరాధన సరయిన రీతిలో జరగగలుగుతుంది. దైవం ప్రతిచోట తన కారుణ్యం చేత నిజమయిన ప్రార్థనను స్వీకరిస్తాడు ..... నేను వాస్తవంగా ఇస్రాయీల్ వంశం వారి వద్దకు మోక్షాన్ని కలిగించే ప్రవక్తగా పంపించబడ్డాను. కాని నా తరువాత మసీహ్ రానున్నాడు. దైవం పంపించినవాడు, ప్రపంచం మొత్తం వద్దకు. ఆయన కోసమే దైవం ఈ ప్రపంచాన్ని నిర్మిం చాడు. అప్పుడు ప్రపంచమంతటా దేవుని ఆరాధన జరుగుతుంది. ఆయన కారుణ్యం అవతరిస్తుంది."

(అధ్యాయం : 83)

"(ఏసు యాజకుల నాయకునితో అన్నాడు) సజీవుడయిన దేవునిపైన ఒట్టు, ఆయన సమక్షంలో నా ప్రాణం సిద్ధమయి ఉంది. ప్రపంచ జాతులు ఎవని రాకను గురించి నిరీక్షిస్తున్నాయో నేను ఆ 'మసీహ్' ని కాను. ఆయన గురించి దేవుడు మన తండ్రి ఇబ్రాహీమ్‌కు ఇలా చెబుతూ వాగ్దానం చేశాడు, "భూలోకములోని జనములన్నియు నీ సంతానము వలన ఆశీర్వదింపబడును." (ఆదికాండము: 22:18). కాని దైవం నన్ను ప్రపంచం నుండి తీసుకుని పోయినప్పుడు షైతాన్ మళ్ళీ తిరుగుబాటు విద్రోహాన్ని చెలరేపుతాడు. ధర్మనిష్ఠ లేనివారు నన్ను దేవుడని, దేవుని కుమారుడని నమ్ముతారు. దాని కారణంగా నా మాటలు, నా బోధనలు రూపుమాపబడును. కడకు అతి కష్టంగా 30 మంది విశ్వాసులయిన వారు మిగిలి ఉంటారు. అప్పుడు దేవుడు ప్రపంచంపైన కరుణ కురిపిస్తాడు. తన సందేశహరుణ్ణి పంపుతాడు. అతని కోసమే ప్రపంచంలోని ఈ సమస్త వస్తువులూ చేశాడు. ఆయన బలోపేతుడయి దక్షిణ ప్రాంతం నుండి వస్తాడు. విగ్రహాలను, విగ్రహారాధకులతో పాటు వినాశపరుస్తాడు. షైతాన్ మానవులపైన సాధించిన అధికారాన్ని వశపరచుకుంటాడు. ఆయన దేవుని కారుణ్యాన్ని, తనను విశ్వసించిన వారి మోక్షం కొరకు తనతో పాటు తీసుకువస్తాడు. ఆయన మాటలను నమ్మేవారు శుభం గలవారు." (అధ్యాయం : 96)

"యాజకుల నాయకుడు అడిగాడు, దేవుని ఆ సందేశహరుని తరువాత ఇతర ప్రవక్తలూ వస్తారా? ఏసు

సమాధానంగా, ఆయన తరువాత దైవం పంపిన నిజ ప్రవక్తలు రారు, కాని బూటకపు ప్రవక్తలు అనేకమంది వస్తారు. వారిని గురించి నాకు ఎంతో బాధగా ఉంది. ఎందుకంటే, దేవుని న్యాయవంతమయిన నిర్ణయం కారణంగా షైతాన్ వారిని వెలియజేస్తాడు. వారు నా సువార్తల చాటున తమ్ముతాము దాచుకుంటారు."

(అధ్యాయం : 97)

ప్రధాన యాజకుడు అడిగాడు, ఆ క్రీస్తు ఏ పేరుతో పిలువ బడతాడు, ఆయన రాకను వ్యక్తం చేసే చిహ్నా లేమిటి? అని. ఏసు సమాధానంగ్గా, ఆ మసీహ్ పేరు "ప్రశంస నీయుడు." దేవుడు అతని ఆత్మను సృజించినప్పుడు ఆయన స్వయంగా అతనికి ఈ పేరు పెట్టాడు. అక్కడ అతన్ని ఒక దైవిక మహత్తులో భద్రపరచడం జరిగింది. దేవుడు, "ముహమ్మద్, నిరీక్షించు, ఎందుకంటే నీ కొరకే నేను స్వర్గం, ప్రపంచం, మరి అనేక జీవరాశు లను సృజించనున్నాను. దాన్ని నీకు కానుకగా ఇస్తాను. కడకు నీ శుభం కోరేవారికి శుభం కలుగుతుంది. నిన్ను దూషించేవాడు శపించబడతాడు. నేను నిన్ను ప్రపంచం వైపునకు పంపినప్పుడు నేను నిన్ను నా మోక్షము కలిగించే సందేశహరునిగా పంపుతాను. నీ మాట సత్యమయినదిగా అలరారుతుంది. చివరికి భూమ్యాకాశాలు తప్పిపోయినా నీ ధర్మం దారి తప్పదు. కాగా అతని శుభనామం ముహమ్మద్" (అధ్యాయం : 97)

బర్నబా వ్రాసిన దాని ప్రకారం, ఒక సందర్భంలో తన శిష్యుల సమక్షంలో హజ్రత్ ఈసా (అ), నా శిష్యులలో ఒకడు (తరువాత అతను ఇస్కరయోతి యూదా అని తేలింది) నన్ను 30 నాణెములకుగాను శత్రువులకు అమ్మివేస్తాడు అని చెప్పి ఇలా సెలవిచ్చారు :

"ఆ తరువాత నాకు గట్టిగా నమ్మకముంది, నన్ను అమ్మిన వాడే నా పేరుతో చంపివేయబడతాడు. ఎందుకంటే, దేవుడు నన్ను భువి నుండి పైకి లేపుకుంటాడు. ఆ ద్రోహి రూపాన్ని మార్చివేయగా ప్రతి వ్యక్తి అతను నేనే అని అనుకుంటాడు. అయినప్పటికీ అతను ఒక చెడ్డ చావు చచ్చినప్పుడు చాలా కాలం వరకు నన్నే కించపరచడం జరుగుతుంది. కాని ముహమ్మద్, దేవుని పవిత్ర సందేశ హరుడు వచ్చినప్పుడు నా ఆ అప్రతిష్ఠ దూరం చేయబడు తుంది. దేవుడు ఇలా చేయడానికి కారణం, నేను ఆ "మసీహ్" సత్యతను అంగీకరించాను. దీనికి గాను ఆయన నాకు ఈ బహుమానం అందజేస్తాడు - నేను బ్రతికి ఉన్నానని, ఆ హేయమయిన చావుకు నాకూ ఎటువంటి సంబంధం లేదని జనులు తెలుసు కుంటారు."

(అధ్యాయం : 113)

"(శిష్యులతో హజ్రత్ ఈసా (అ) అన్నారు) : నిస్సం దేహంగా నేను మీకు చెబుతున్నాను. ఒకవేళ మూసా గ్రంథం నుండి సత్యతను రూపుమాపి ఉండకపోతే దైవం మన తండ్రి దావీదుకు మరో గ్రంథాన్ని ఇచ్చేవాడు కాదు. ఒకవేళ దావీదు గ్రంథంలో ప్రక్షిప్తాలు చేయకున్నట్లయితే

నాకు దేవుడు సువార్తలు ఇచ్చేవాడు కాదు. ఎందుకంటే, ప్రభువయిన మన దేవుడు మారేవాడు కాడు, ఆయన మానవులందరికీ ఒకే సందేశాన్ని అందజేశాడు. కాగా దైవసందేశహరుడు వచ్చినప్పుడు, దేవుణ్ణి నమ్మని జనులు ఏ విషయాలతో నా గ్రంథాన్ని కలుషితం చేసివేశారో వాటిని శుభ్రపరచడానికి వస్తాడు." (అధ్యాయం : 124)

ఈ స్పష్టమయిన, సవివరమయిన భవిష్యవాణులలో కేవలం మూడు విషయాలున్నాయి. అవి స్థూలంగా చూస్తే అవగాహనకు అవాంతరాలుగా అనిపిస్తాయి. ఒకటి ఏమిటంటే, ఈ వివరాలలోనూ, బర్నబా సువార్తలోని అనేక ఇతర వచనాలలోనూ మహనీయ ఈసా (అ) తాను 'మసీహ్' కానని తిరస్కృతి తెలిపారు. రెండవది, కేవలం పైన పేర్కొన్న ఈ వచనాలలోనే కాక ఈ సువార్తలోని చాలాచోట్ల దైవసందేశహరులు (స) అసలు అరబీ పేరు "ముహమ్మద్" వ్రాయబడి ఉంది. నిజానికి ఇది దైవప్రవక్తలు భవిష్యవాణుల్లో అనుసరించే సాధారణ పద్ధతి కాదు. తరువాత రాబోయే ఏ వ్యక్తిత్వాన్నీ అసలు పేరు పెట్టి ఎత్తి చూపడం వారి విధానం కాదు. మూడవది, ఇందులో మహనీయ ప్రవక్త (స) ని 'మసీహ్'గా పేర్కొనడం జరిగింది.

మొదటి సంశయానికి సమాధానం ఏమిటంటే, కేవలం బర్నబా సువార్తలోనే కాదు, లూకా సువార్తలో సయితం ఈ ప్రస్తావన ఉంది. హజ్రత్ ఈసా (అ) తన శిష్యులను, తనను మసీహ్ అని పిలువరాదని వారించారు. లూకాలోని పదాలు ఇలా ఉన్నాయి :

"అందుకాయన – మీరైతే నేనెవరనని చెప్పుకొనుచున్నారని వారినడుగగా పేతురు – నీవు దేవుని క్రీస్తువనెను. ఆయన

– ఇది ఎవరితోనూ చెప్పవద్దని వారికి ఖండితముగా ఆజ్ఞాపించి ...." (లూకా : 9 : 20-21).

బహుశా దీనికి కారణం ఏమిటంటే, బనీ ఇస్రాయీల్ ఏ 'మసీహ్' కోసం ఎదురు చూస్తున్నారో ఆయన గురించి వారి అభిప్రాయం ప్రకారం ఆయన కరవాల బలంతో సత్య విరోధులను వశపరచుకుంటాడు. అందువల్ల హజ్రత్ ఈసా (అ), నేను ఆ 'మసీహ్'ని కాను, ఆయన నా తరువాత వస్తాడు అని అన్నారు.

రెండవ సందేహానికి సమాధానం, బర్నబా సువార్తను నేడు ప్రపంచంలో లభించిన ఇటాలియన్ అనువాదంలోనయితే ప్రవక్తశ్రీ (స) పేరు నిస్సందేహంగా 'ముహమ్మద్' అని వ్రాయబడి ఉంది. కాని ఈ గ్రంథం ఏ ఏ భాషల నుండి అనువాదానికి అనువాదమవుతూ ఇటాలియన్ భాషలోకి వచ్చిందో ఎవరికీ తెలియదు. మూల బర్నబా సువార్త సిరియాక్ భాషలో వ్రాయబడి ఉంటుందన్నది సుస్పష్టమయిన విషయమే. ఎందుకంటే, అదే హజ్రత్ ఈసా (అ), ఆయన శిష్యుల భాష. ఆ అసలు గ్రంథం ప్రాప్తమయి ఉన్నట్లయితే అందులో ప్రవక్తశ్రీ (స) పేరు, ఏమని వ్రాయబడి ఉందో చూడగలిగేవారము. ఇప్పుడు కేవలం ఊహించిమటుకే చెప్పగలం. వాస్తవంగా హజ్రత్ ఈసా (అ) 'మున్హమన్నా' అన్న పదం ప్రయోగించి ఉంటారు, దీన్ని మనం ఇబ్ను ఇస్హాక్ ఉదాహరించిన యోహాను సువార్త ప్రస్తావనలో పేర్కొని ఉన్నాము. ఆ తరువాత విభిన్న అనువాదకులు తమ తమ భాషల్లో దీని అనువాదాలు చేసి ఉంటారు. ఆ తరువాత ఎవరో ఒక అనువాదకుడు, భవిష్యవాణిలో చూపబడిన, వచ్చేవారి పేరు పూర్తిగా "ముహమ్మద్"కు సమానార్థకమయినదని గమనించి ఆయన పేరే వ్రాసి ఉంటాడు. అందువల్ల కేవలం

ఈ పేరు విశదీకరణ, పూర్తి బర్నబా సువార్త ఎవరో ముస్లిమ్ కల్పన చేసి రచించాడని అనుమానించడానికి సరిపోదు.

మూడవ సందేహానికి సమాధానం : 'మసీహ్' (క్రీస్తు) అన్నది వాస్తవానికి ఒక ఇస్రాయీలీ పారిభాషిక పదం. దీన్ని దివ్య ఖుర్ఆన్‌లో ప్రత్యేకంగా మహనీయ ఈసా (అ) కొరకు, కేవలం యూదులు ఆయన మసీహ్ అవడాన్ని నిరాకరించిన కారణంగానే ప్రయోగించడం జరిగింది. నిజానికి ఇది ఖుర్ఆన్ పరిభాష కాదు; దీన్ని ఖుర్ఆన్‌లో ఇస్రాయీలీయుల పరిభాషలో ఎక్కడా ప్రయోగించనూ లేదు. అయితే దైవ సందేశహరుల (స) కొరకు, హజ్రత్ ఈసా (అ) 'మసీహ్' అనే పదం ప్రయోగించారు, ఖుర్ఆన్‌లో ఆయన విషయంలో ఎక్కడా ఈ పదం ప్రయోగించలేదు. అందువల్ల బర్నబా సువార్త ఆయనకు, ఖుర్ఆన్ నిరాకరించే ఏ విషయాన్నయినా ఆపాదిస్తున్నదన్న నిర్ణయానికి రావడం సరయినది కాదు. వాస్తవానికి బనీ ఇస్రాయీల్‌లో ప్రాచీన పద్ధతి ప్రకారం, ఒక వస్తువును లేదా ఒక వ్యక్తిని ఏదయినా పవిత్రత ఉద్దేశ్యంతో ప్రత్యేకించి నప్పుడు ఆ వస్తువును లేదా ఆ వ్యక్తికి తలపైన నూనె మర్దన చేసి దాన్ని లేదా అతన్ని పవిత్రమయినది (Consecrate) చేయడం జరిగేది. హెబ్రూ భాషలో నూనె మర్దన చేసే ఈ క్రియను 'మసహ్' అనేవారు, ఎవరికయితే ఈ మర్దన చేస్తారో అతన్ని 'మసీహ్' అనేవారు. ఆరాధనాలయంలోని పాత్రలు ఇదేవిధంగా 'మసహ్' చేసి ఆరాధనకు అంకితం చేసేవారు. యాజకులను యాజక వృత్తి (Priesthood) పదవి పైన నియోగించే టప్పుడు కూడా 'మసహ్' చేసేవారు. రాజును, ప్రవక్తను దైవం తరఫున రాచరికానికీ లేదా ప్రవక్త బాధ్యతలపైన నియోగించి నప్పుడు వారిని 'మసహ్' చేసేవారు. కాగా బైబిల్ ప్రకారం, బనీ ఇస్రాయీల్ చరిత్రలో

అసంఖ్యాకమయిన 'మసీహ్'లు కానవస్తారు. హజ్రత్ హారూన్ యాజకుని స్థితిలో, 'మసీహ్'గా పరిగణించబడేవారు. హజ్రత్ మూసా యాజకుని గాను, ప్రవక్తగాను, తాలూత్ రాజుగాను, హజ్రత్ దావూద్ రాజుగాను, ప్రవక్తగాను, 'మలికెసదక్' రాజుగాను, యాజకునిగాను, హజ్రత్ యస్అ ప్రవక్తగాను - మసీహ్ అని పరిగణించ బడేవారు. ఆ తరువాత నూనె మర్దన చేసియే ఎవరినయినా నియమిం చడం కూడా అవసరం లేకుండా పోయింది. కేవలం ఎవరయినా దైవం తరఫున నియమితులడమే 'మసీహ్' అవడానికి సమానంగా ఎంచబడేది. ఉదాహరణకు చూడండి, రాజులు-1 : 19వ అధ్యాయంలో మహనీయ ఏలియా (ఇల్యాస్) కు దేవుడు, హెజాయేలునకు మసహ్ చేసి 'సిరియ' (దమస్కు) కు రాజుగా చేయమని, నిరిషీ కుమారుడైన యెహోను అభిషేకించి ఇస్రాయీల్‌కు రాజుగాను, ఎలీషా (అల్‌యస్అ)ను అభిషేకించి నీకు బదులు ప్రవక్తగా చేయమని ఆదేశించాడు. వీరిలో ఎవరి తల మీదనూ నూనె మర్దన చేయలేదు. కేవలం దైవం పక్షాన వారి నియామకం చేసినట్లు నిర్ణయ ప్రకటన చేయడమే వారిని 'మస్‌హ్' చేయడమన్నమాట. కాగా ఇస్రాయీలీయుల భావన రీత్యా 'మసీహ్' అన్న పదం వాస్తవానికి 'దైవం తరఫున నియుక్తుడు' అన్నదానికి సమానార్థకమన్నమాట. ఇదే అర్థంలో మహనీయ ఈసా (అ), దైవ సందేశహరుడు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) కొరకు ఈ పదాన్ని ప్రయోగించారు.★

- : సమాప్తం : -

★ మసీహ్' అన్న పదానికి ఇస్రాయీలీయుల భావం, దాని విశదీకరణ కొరకు చూడండి 'సైక్లోపీడియా ఆఫ్ బిబ్లికల్ లిటరేచర్ - పదం "మైసేయాహ్".